www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
27 సెప్టెంబర్ 2026
సంపుటి:4 సంచిక: 262

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## పేదల సొంతింటి కల సాకారం చేస్తాం

- జనగామలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన పొంగులేటి
- తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- గతంలో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లకు కూడా విడతల వారీగా నిధుల అందజేత
- జనగామలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పూర్తికి రూ.2 కోట్లు తక్షణ మంజూరు
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీతో రూ.70 వేల కోట్లకు పైగా రుణాలు
- రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని స్పష్టీకరణ

02

## వరంగల్ నుంచి బీజేపీ బిగ్ ప్లాన్



- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండలపై బీజేపీ ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్‌లో మధుకర్, వరంగల్‌లో దశరథ్‌లకు కీలక బాధ్యతలు
- తెలుగు భాష నేతలతో సమన్వయం కోసమే ఈ నాయకత్వ మార్పు
- వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలే కొత్త బృందానికి తొలి పరీక్ష
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక సన్నాహాలు
- మూడు జిల్లాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా బీజేపీ సరికొత్త వ్యూహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో పట్టు సాధించాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్లగొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో కొన్ని చోట్ల గెలిచినా ఆ ప్రభావాన్ని నిలకడగా కొనసాగించలేకపోయింది. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ఈ మూడు ప్రాంతాల్లో ఎక్కువ సీట్లు గెలవడం చాలా ముఖ్యం. అందుకే పార్టీ నాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వరంగల్‌ను కీలక కేంద్రంగా ఎంచుకుని కొత్త కార్యాచరణను రూపొందించింది. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించడం బలహీనంగా ఉన్న చోట నాయకులను సిద్ధం చేయడం మొదలుపెట్టింది. కార్యకర్తలను చురుకుగా పనిచేయించేందుకు సరికొత్త ప్రణాళికలు రచిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో ఈ నిర్ణయం ఎలాంటి మార్పులు

మిగతా 2లో..

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో కవిత పార్టీ

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై లోపాయికారీ ఆరోపణలు
- ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలపై ఆవేదన
- వైద్య రంగానికి 5 శాతం బడ్జెట్ కేటాయింపు
- ఫామ్‌హౌస్ రాజకీయాలంటూ ఇరు పార్టీలపై ఫైర్
- బలమైన అభ్యర్థితో ఎన్నికల బరిలోకి దిగుతాం

03



ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు ప్రస్తుతం యూరియా కష్టాలు చుట్టుముట్టాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ అన్నదాతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. పాత పద్ధతిని మార్చి ఈ డిజిటల్ విధానాన్ని అమల్లోకి తేవడంతో లక్షలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కొత్త యాప్‌లో బుకింగ్ చేయడం చాలా కష్టంగా మారింది. క్షణాల వ్యవధిలోనే స్టాక్ మొత్తం అయిపోతుండటంతో రైతులు దిక్కుతోచక చూస్తున్నారు.

# రైతన్న గోసను పట్టించుకోరా?

### కొత్త యూరియా యాప్‌తో రైతన్నలకు తీవ్ర ఇబ్బందులు



- యాప్‌లో వివరాలు సరిగా రాక గంటల తరబడి కుస్తీ
- స్మార్ట్ ఫోన్లు, టెక్నాలజీ తెలియక నిరక్షరాస్యుల అరిగోస
- దూర ప్రాంతాల్లో స్టాక్ చూపడంతో అదనపు రవాణా భారం
- యూరియా కోసం యాప్‌లో బలవంతంగా ఇతర ఎరువుల ఎంపిక
- పాత పద్ధతిలోనే నేరుగా యూరియా అందించాలని డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తయినప్పటికీ చాలామంది వివరాలు యాప్‌లో సరిగ్గా చూపించడం లేదు. కొందరి పేర్లు పూర్తిగా గల్లంతు కావడంతో వ్యవసాయ అధికారుల కార్యాలయాల చుట్టూ పరుగులు తీయాల్సి వస్తోంది. వేర్వేరు సర్వే నంబర్లలో పంట సాగు చేస్తున్నవారు ప్రత్యేకంగా బుక్ చేసుకోవడానికి గంటల తరబడి ఫోన్లతో కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఒక మండలంలో దొరికే ఎరువుల కోసం జిల్లా అంతటా ఉన్న షాపులను యాప్ చూపిస్తోంది. ఈ యాప్‌లో యూరియా ఒక్కటే కావాలన్నా కూడా డీఏపీ లాంటి మరో మూడు రకాలను కలిపి డిక్కు పెడితే తప్ప బుకింగ్ పూర్తి కావడం లేదు. దీనివల్ల రైతులు తీవ్రమైన ఆగ్రహానికి గురవుతున్నారు. మాకు యాప్ ద్వారా కాకుండా పాత పద్ధతిలోనే నేరుగా ఎరువులు ఇవ్వాలని

మిగతా 2లో..



ఆర్ఎంపీలు పరిమితికి మించిన

## వైద్యం చేస్తే కఠిన చర్యలు

- దోసపాటి ఇంటిని సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ బృందం
- ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవాలి
- డిప్యూటీ డి అండ్ ఎమ్ హెచ్ ఓ శ్రీధర్

03



కేసముద్రం పోలీస్‌స్టేషన్‌ను

## ఆకస్మికంగా తనిఖీ ఎస్పీ శబరీష్

- సిబ్బంది విధులు, గ్రామాల సందర్శనలపై ఎస్పీ ఆరా
- రాత్రి గస్తీ పటిష్టం చేయాలి
- నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా
- ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన
- పోలీస్–ప్రజల సత్సంబంధాలు పెంపొందించాలి
- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్

05



## భారతదేశం గర్వించదగ్గ జాతిరత్నం మన్మోహన్

- మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన సీఎం
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన స్మారక పార్క్, విగ్రహం ఆవిష్కరణ
- దేశ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేయడంతో పాటు చట్టాల రూపకల్పన
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై ఆయన సంతకాన్ని పార్కులో ప్రదర్శన
- ఢిల్లీలో ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్
- ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న పురస్కారం అందించి గౌరవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన మన్మోహన్ సింగ్.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ద్వారా రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని

మిగతా 3లో..

## గణేశ్ నిమజ్జనాల్లో 13 మంది మృతి

- హైదరాబాద్‌లో ఘనంగా గణనాథుల వీడ్కోలు
- నిమజ్జన వేడుకల్లో విషాదం.. 13 మంది మృతి
- వాహనం ఢీకొని విధుల్లో ఉన్న ఎస్సై మృతి
- చెరువులో పడి ఆరుగురు యువకులు బలవన్మరణం
- రాష్ట్రంలో సుమారు 1.24 లక్షల విగ్రహాల ప్రతిష్ట

వైభవంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. చిన్నా పెద్దా అంతా కలిసి పోయిరా గణపయ్య అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వీధుల్లో ఎక్కడ చూసినా అన్నదాన కార్యక్రమాలు,

మిగతా 3లో..



## 2028లో కేసీఆర్ సీఎం..!



- పాలిచ్చే బర్రెను వదులుకుని దున్నపోతును తెచ్చుకున్నారు
- 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం
- రైతుబంధు ఎగ్గొట్టి కాంగ్రెస్ మోసం చేస్తోంది
- ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారు
- గ్రాడ్యుయేట్స్ అందరూ త్వరగా ఓటు నమోదు చేసుకోవాలి
- దోపిడీ పాలన అంతం ప్రజల చేతుల్లోనే ఉంది

02

## ధాన్యం దిగుబడి డౌన్!

- ఎల్ నినో కారణంగా తగ్గనున్న ధాన్యం దిగుబడి
- గతేడాదితో పోలిస్తే 14 శాతం తగ్గిన వరి సాగు
- తక్కువ వర్షపాతం, ఉష్ణోగ్రతల మార్పులే ప్రధాన కారణం
- పెరిగిన పత్తి, పప్పుధాన్యాలు, తృణధాన్యాల సాగు విస్తీర్ణం
- ఉత్పత్తి తగ్గి ఓపెన్ మార్కెట్‌లో పెరగనున్న బియ్యం ధరలు
- క్వింటాల్ ఫైన్ రైస్ ధర రూ.10 వేలు దాటే అవకాశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
వ్యవసాయ రంగంపై ఎల్ నినో తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. ఉష్ణోగ్రతల్లో వచ్చిన అనూహ్య మార్పుల వల్ల ఈసారి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం గతేడాదితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణం 14 శాతం తగ్గింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కాల్వల ద్వారా సాగునీరు అందలేదు. ప్రభుత్వ సూచనల మేరకు రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపారు. తృణధాన్యాలు పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. జొన్నలు సజ్జలు రాగులు కందులు పెసర్లు మినుములు పత్తి పంటల సాగు గణనీయంగా పుంజుకుంది. కొర్రలు సామలు లాంటి మైనర్ మిల్లెట్స్ సాగు మూడు రెట్లు అధికమైంది. నైరుతి రుతుపవనాలు సకాలంలో కురవకపోవడంతో సాధారణ వర్షపాతం ఇరవై శాతం తగ్గింది. రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోయాయి. భూగర్భ జలాల లభ్యత కూడా తగ్గిపోయింది. ఇవన్నీ కలిసి

మిగతా 2లో..

## తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోనే అధికారం

► బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు బుద్ధుల బిక్షపతి

**విశాలభారతి, శివ్వంపేట :** తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ నాయకత్వంలో అధికారం చేపట్టడం ఖాయమని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) మెదక్ జిల్లా శివ్వంపేట మండల ప్రచార కార్యదర్శి బుద్ధుల బిక్షపతి, శనివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ అనే విధంగా ఉండేదని, ప్రస్తుతం తెలంగాణలోని అన్ని జిల్లాల ప్రజలు సమస్యలతో నరకయాతన అనుభవిస్తున్నారని బుద్ధుల బిక్షపతి ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు. రైతులకు సకాలంలో కరెంటు అందించలేకపోవడమే కాకుండా. ఎరువులు దొరకగా దీనస్థితిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో పంటలన్నీ సస్యశ్యామలంగా పండేవని, ప్రజలందరూ కూడా సుభిక్షంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు, అబద్ధాల హామీలు కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నేడు ప్రజలందరికీ అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని బుద్ధుల బిక్షపతి, ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రజలందరూ మళ్లీ ఆలోచిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మళ్ళీ కేసీఆర్ కి పట్టం కడితే బాగుంటుందని, ప్రజలందరూ బహిరంగంగానే అంటున్నారని ఆయన వివరించారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, నాయకత్వంలో మరింత అభివృద్ధి చెందాయని ఆయన అన్నారు. తెలంగాణ ప్రాంతంలో బిఆర్ఎస్ పార్టీ మరింత బలపడిందని, ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి అధికారం చేపట్టడం తధ్యమని బుద్ధుల బిక్షపతి, జోస్యం చెప్పారు.

# పేదల సొంతింటి కల సాకారం చేస్తాం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదింటి ఆడబిడ్డ కుటుంబంలో చిరునవ్వు చూడాలన్న తపనతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబం ఇందిరమ్మ ఇల్లు విషయంలో నిరాశ చెందాల్సిన అవసరం లేదని.. విడతల వారీగా ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రెస్టన్ కళాశాల మైదానంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతోపాటు కాస్మోటిక్ ఛార్జీలను పెంచినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి.. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని పొంగులేటి తెలిపారు. దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించామని.. జనగామ నియోజకవర్గానికి కూడా అదే సంఖ్యలో ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇంటి నిర్మాణం వివిధ దశలకు చేరుకున్న కొద్దీ ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని.. ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2 వేల ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుగా పూరిళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిళ్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, మొండిగోడల వద్ద ఆగిపోయిన ఇళ్లు, స్లాబ్ స్థాయిలో నిలిచిన ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని రెండో విడతలో అమలు చేస్తున్నామని చెప్పారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి అర్హులకు పంపిణీ చేసి.. తదుపరి విడతల్లో అక్కడ కూడా ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి లబ్ధిదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పొంగులేటి అన్నారు. జనగామలో ఇందుకు అవసరమైన రూ.2 కోట్లను వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దసరా నాటికి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి తొలి విడతగా రూ.25 కోట్లు వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రూ.58-60 కోట్ల పనులతోపాటు టెండర్లు పూర్తయిన రూ.19 కోట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా సున్నా వడ్డీ రుణాలు అందించామని మంత్రి తెలిపారు. రైతు భరోసా కొనసాగిస్తున్నామని, వరి రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మరో 14-15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రస్తావించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయని, వాటిని వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వడ్లకొండ-శామీర్‌పేట్ బైపాస్ రోడ్డును డబుల్ లైన్ చేయడంతోపాటు చీటకోడూరు బ్రిడ్జి, గండిరామారం పంపుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రైతన్న గోసను పట్టించుకోరా?

**మొదటిపేజీ తరువాయి**

అన్నదాతలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకోవడంతో రెండు దఫాలుగా యూరియా వేయడం చాలా తప్పనిసరి. ఈ సమయానికి ఎరువు అందకపోతే పంట దెబ్బతింటుందనే భయంతో కొందరు రైతులు ఖరీదైన యూరియా లిక్విడ్‌ను వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయి రైతన్నల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోతోంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త సాంకేతిక విధానం సామాన్య రైతులకు శాపంగా మారింది. అసలు స్మార్ట్ ఫోన్ అంటే ఏమిటో తెలియని నిరక్షరాస్యులైన రైతులు ఓటీపీలు, బుకింగ్ ప్రక్రియను అర్థం చేసుకోలేక తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో ఉండే పెద్ద వయసు వారు ఈ యాప్ కష్టాలు పడలేక యువకుల చుట్టూ తిరుగుతున్నారు. ఐదు ఎకరాల్లో పంట వేసిన జక్కి మల్లయ్య అనే రైతు యూరియా బస్తాల కోసం జిల్లా మొత్తం తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు మండల కేంద్రంలోనే సులభంగా దొరికేవి కానీ ఇప్పుడు ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆయన ఆవేదన చెందుతున్నారు. రైతు రాజు అని చెప్పడం కేవలం మాటలకే పరిమితమైందని క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయని రైతులు మండిపడుతున్నారు. సాగునీరు, ఎరువులు సకాలంలో అందితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నదాతలు స్పష్టం చేస్తున్నారు. మరో యువ రైతు ఉమేశ్ మాట్లాడుతూ గతంలో ఎలాంటి కొనుగోలు పరిమితులు లేవని గుర్తు చేశారు. ఇప్పుడు ఎరువులు దొరకక ఇబ్బందులు పడుతూ అధిక ధరలు పెట్టి లిక్విడ్ కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతుల కష్టాలను గమనించాలని వేడుకుంటున్నారు. అందరికీ సరిపడేలా ఎరువులు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. యాభై ఏళ్లు దాటిన వృద్ధ రైతులు సైతం ఈ డిజిటల్ కష్టాల వల్ల నానా తంటాలు పడుతున్నారు. డెబ్బై ఏళ్ల వయసున్న గడ్డం సాయిలు అనే వృద్ధ రైతు మాట్లాడుతూ తనకు చదువు రాదని సెల్ ఫోన్ ఎలా వాడాలో కూడా తెలీదని చెప్పారు. రెండు ఎకరాల్లో వరి పంట వేసిన తనకు యూరియా బస్తాలు కావాలంటే ఈ కొత్త యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని చెబుతున్నారని వాపోయారు. అసలు ఆ యాప్ గురించే తమకు ఏమీ తెలియదని పాత పద్ధతిలోనే ఎరువులు ఇస్తే బాగుంటుందని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఇలాంటి నిరక్షరాస్యులైన వృద్ధ రైతుల గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రభుత్వాలు ఏ పథకం తెచ్చినా అది సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా ఉండాలి కానీ ఇలా వేధించేలా





ఉండకూడదు. సాంకేతిక లోపాలు, అవగాహన లేమి కారణంగా అన్నదాతలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి క్షేత్రస్థాయి సమస్యలను పరిశీలించి తగిన సడలింపులు ఇవ్వాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ యూరియా యాప్ విధానాన్ని పూర్తిగా సమీక్షించి మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాంకేతిక సమస్యల వల్ల అన్నదాతలు ఇకపై రోడ్లెక్కి ఆందోళన చేసే పరిస్థితి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. స్మార్ట్ ఫోన్లు లేనివారు, చదువురాని సామాన్య రైతులు గంటల తరబడి ఫోన్లతో కుస్తీలు పట్టే పరిస్థితిని వెంటనే తొలగించాలి. గతంలో మాదిరిగా స్థానిక దుకాణాల్లో నేరుగా విక్రయించే సరళమైన విధానాన్ని మళ్లీ పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. అప్పుడే అన్నదాతల కన్నీళ్లు తుడిచిపోతాయి. పంటలు బాగా పండి దేశం సుభిక్షంగా మారుతుంది.

# 2028లో కేసీఆర్ సీఎం..!




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన కాంగ్రెస్ నాయకులు భారీగా బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా గులాబీ కండువా కప్పి వారిని కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజలు పాలిచ్చే బర్రెను వదులుకుని తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. సరైన నాయకుడిని ఎన్నుకోకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. రాబోయే ఎన్నికలలో ప్రజల నాడి ఎలా ఉంటుందో సర్వేలు స్పష్టంగా చెబుతున్నాయని వివరించారు. కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజలు ఆదమరిచి మోసపోవద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ పార్టీ నేతలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి రైతుకు సకాలంలో రైతుబంధు అందిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. నాట్లు వేసే సమయానికి అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవని చెప్పారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని ఆరోపించారు. కేవలం వంద రోజులలోనే అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని దుయ్యబట్టారు. మోసగాళ్లను నమ్ముకుంటే ఇదే పరిస్థితి వస్తుందని రేవంత్ రెడ్డి ముందే చెప్పారని ఎద్దేవా చేశారు. పాత రోజులు తెస్తామని చెప్పి ప్రజలను మభ్యపెట్టారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వాన్ని కోల్పోయిన తర్వాత ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు. సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో పేదలు తీవ్ర అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఎవరు అధికారంలోకి వచ్చినా సంక్షేమ పథకాలు ఆగిపోవని ప్రజలు భావించారని కేటీఆర్ తెలిపారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లుగా తయారైందని ముందుగానే హెచ్చరించామని గుర్తు చేశారు. మహబూబాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే ఆ గెలిచిన నాయకుడు ఇప్పుడు కనీసం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఇనుగుర్తి గడ్డపై పుట్టిన ఈ ధిక్కార ఉద్యమం జిల్లా అంతటా వేగంగా పాకాలని పిలుపునిచ్చారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా కీలకమని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రులందరూ విధిగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. ఈ దోపిడీ పాలనకు చరమగీతం పాడే శక్తి కేవలం ప్రజల చేతుల్లోనే ఉందని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పరిపాలనను తరిమికొట్టేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని మరోసారి తేల్చిచెప్పారు. మూడేళ్ల పాటు కేసీఆర్ ప్రజలకు నేరుగా కనిపించకపోయినా ప్రతి గల్లీలోనూ ఆయన పాటలే వినిపిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కోదాడ నుంచి సూర్యాపేట వరకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ప్రజలు తలచుకుంటున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు బంద్ కావడంతో పేదల జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయని ఆవేదన చెందారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి ఇంటా పండుగ వాతావరణం ఉండేదని గుర్తు చేశారు. మళ్లీ ఆ మంచి రోజులు రావాలంటే కేసీఆర్ నాయకత్వం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ శ్రమించాలని కోరారు. ఇనుగుర్తిలో పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా కచ్చితంగా ఇచ్చారు. కార్యకర్తలు సైనికులా పని చేసి పార్టీ విజయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేటీఆర్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటల మాయాజాలంలో పడి మోసపోవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ విశ్రమించదని స్పష్టం చేశారు. రైతులకు అండగా నిలవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మరోసారి విమర్శించారు. రాబోయే ఎన్నికలలో గులాబీ జెండా ఎగరడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ఇనుగుర్తిలో మొదలైన ఈ రాజకీయ మార్పు ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుందని చెప్పారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం సైనికుడిలా పనిచేయాలని కోరారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మళ్లీ ప్రగతి పథంలో దూసుకుపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతోనే రాబోయే కాలంలో గొప్ప విజయాలు సాధిస్తామని ధైర్యంగా తెలిపారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

► ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

**విశాలభారతి, నిజామాబాద్ :** దొరల పాలనను ధిక్కరించి, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆమెకు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె నిర్భయంగా పోరాడారని పేర్కొన్నారు. సామాజిక వివక్ష, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం అణగారిన ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పిలుపునిచ్చారు.



# ధాన్యం దిగుబడి డౌన్!



**మొదటిపేజీ తరువాయి**

వరి సాగును తీవ్రంగా దెబ్బతీశాయి. రాష్ట్రంలో సుమారు పక్షం లక్షల ఎకరాల మేర వరి సాగు పడిపోయింది. నల్లగొండ సూర్యాపేట భువనగిరి సిద్దిపేట సిరిసిల్ల ప్రాంతాలలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. గతేడాది ఖరీఫ్‌లో కోటిన్నర టన్నుల ధాన్యం దిగుబడి లభించింది. ఈసారి అది కోటి పది లక్షల టన్నులకు పరిమితం కావచ్చని అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రభుత్వం కేవలం ఎనభై లక్షల టన్నులలోపే సేకరించే అవకాశం ఉన్నది. ఖరీఫ్ సీజన్‌లోనే ఈ దుస్థితి ఏర్పడితే రాబోయే రబీ సీజన్ మరింత దయనీయంగా మారుతుంది. ఓపెన్ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరగడానికి ఇది ప్రధాన కారణం అవుతుంది. ఇప్పటికే ఫైన్ వెరైటీ రైస్ క్వింటాల్ ధర ఎనిమిది వేల రూపాయలకు పైగా పలుకుతున్నది. ఎల్ నినో ఎఫెక్ట్‌తో రాబోయే రోజుల్లో ఆ ధర పది వేల రూపాయలు దాటినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. హోల్‌సేల్ వ్యాపారులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి ఇబ్బందులు వర్షాభావం రైతులను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ప్రత్యామ్నాయ పంటలు వేసినప్పటికీ పెట్టుబడులు పెరిగి రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ సహకారం లేకపోతే అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతారు. మార్కెట్లో డిమాండ్‌కు తగినట్లుగా ధాన్యం లభించకపోవడం పెద్ద సమస్యగా మారుతుంది. సామాన్యులపై ఈ ధరల భారం మోయరానిదిగా తయారవుతుంది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృందం ఖరీఫ్ సాగుపై సమగ్రమైన అధ్యయనం నిర్వహించింది. సస్టెయినబుల్ అగ్రికల్చర్ సెంటర్ డైరెక్టర్ సమరేందు మహంతి ఆధ్వర్యంలో ఈ స్టడీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాతావరణ ప్రతికూలతల వల్ల వరి దిగుబడి పడిపోతుందని నిర్ధారించారు. వడ్ల దిగుబడిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ ఈసారి అదే స్థానంలో ఉండవచ్చు. కానీ గత సంవత్సరాలతో పోలిస్తే దిగుబడి మాత్రం చాలా తక్కువగా వస్తుంది. వరి సాగు తగ్గిన ప్రాంతాలలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లోకి అనుకున్న స్థాయిలో వడ్లు రాకపోవడం వల్ల బియ్యం కొరత ఏర్పడుతుంది. నిల్వలు తగ్గిపోవడం వలన వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించే ప్రమాదం ఉంది. దీనివల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలు నానా తంటాలు పడాల్సి వస్తుంది. ప్రభుత్వ విభాగాలు స్పందించి మార్కెట్ ధరలను నియంత్రించాలి. లేకపోతే నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను తాకుతాయి. ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా పడిపోతుంది. ప్రభుత్వం అప్రమత్తమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం చాలా అవసరం. గతేడాది అన్ని రకాల పంటలు కలిపి కోటీ 33 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈసారి ఆ విస్తీర్ణం కోటీ ఇరవై ఆరు లక్షల ఎకరాలకు పడిపోయింది. వరి పంట గతేడాది 67 లక్షల ఎకరాల్లో సాగు కాగా ఈసారి 56 లక్షల ఎకరాలకు పరిమితమైంది. పత్తి పంట 45 లక్షల నుంచి 48 లక్షల ఎకరాలకు పెరిగింది. కందులు సుమారు 5 లక్షల ఎకరాల నుంచి ఐదున్నర లక్షల ఎకరాలకు చేరాయి. పెసర్లు 60 వేల ఎకరాల నుంచి లక్షా 60 వేల ఎకరాలకు విస్తరించాయి. మినుములు 30 వేల నుంచి 70 వేల ఎకరాలకు పైగా సాగయ్యాయి. కొర్రలు సామలు కేవలం 63 ఎకరాల నుంచి దాదాపు 2 వేల ఎకరాలకు చేరుకున్నాయి. సజ్జలు రాగులు తదితర చిరుధాన్యాల సాగు కూడా బాగానే పెరిగింది. రైతులు నష్టాలను తగ్గించుకోవడానికి ఆరుతడి పంటల వైపు అడుగులు వేశారు. ప్రభుత్వం అందించిన విత్తనాలు ఎరువులు కొంతవరకు ఉపయోగపడ్డాయి. అయితే వర్షాలు సరిగా కురవకపోవడం పెద్ద నిరాశ కలిగించింది. బోర్లు బావుల మీద ఆధారపడి రైతులు పంటలను కాపాడుకోవడానికి ప్రయత్నించారు. విద్యుత్ సరఫరా సరిగా అందక రైతన్నలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వరి సాగు తగ్గడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పరోక్ష ప్రభావం పడుతుంది. మిల్లుల యజమానులు కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. బియ్యం ఎగుమతులు నిలిచిపోతే ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంది. ఓపెన్ మార్కెట్‌లో రేట్లు అడ్డగోలుగా పెరిగితే సామాన్యుల బతుకులు భారంగా మారుతాయి. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యం ఉచితంగా అందిస్తున్నప్పటికీ బహిరంగ మార్కెట్ ప్రభావం అందరిపై పడుతుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు నష్టపరిహారం ప్రకటించాలి. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా శాశ్వత నీటి పారుదల వసతులు కల్పించాలి. ఎల్ నినో లాంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలి. శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ రైతులను చైతన్యవంతం చేయాలి. అప్పుడే వ్యవసాయ రంగం నిలదొక్కుకుంటుంది. దేశానికి అన్నం పెట్టే రైతు భరోసాతో ముందుకు సాగుతాడు. ఆహార ధాన్యాల కొరత తీరి ప్రజలు ఇబ్బందుల నుంచి బయటపడతారు. లేదంటే రాబోయే రోజుల్లో కఠినమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. సమర్థవంతమైన విధానాలతోనే ఈ సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుంది.

# వరంగల్ నుంచి బీజేపీ బిగ్ ప్లాన్

**మొదటిపేజీ తరువాయి**

తీసుకువస్తుందో వేచి చూడాలి. క్షేత్రస్థాయిలో పట్టుకోసం పడుతున్న ఈ కష్టాలు ఏ మేరకు ఫలిస్తాయో ఎవరికీ అంతుచిక్కడం లేదు. యువత దీనిపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగానే హైకమాండ్ కీలక నాయకులకు బాధ్యతలు అప్పగించింది. సునీల్ బన్సల్ ఆధ్వర్యంలో అభయ్ పాటిల్ రేఖా శర్మ రాష్ట్ర వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. సంస్థాగత వ్యవస్థను పటిష్టం చేసేందుకు నూకల మధుకర్‌ను హైదరాబాద్ కేంద్రంగా నియమించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలు అందిస్తారు. మరోవైపు దశరథ్‌ను తెలంగాణ సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శిగా




ఎంపిక చేశారు. ఈయన వరంగల్ కేంద్రంగా పని చేసేలా ఏర్పాట్లు జరిగాయి. గతంలో ఉన్న చంద్రశేఖర్ తివారీకి తెలుగు భాషపై పట్టు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. స్థానిక నేతలతో సమన్వయం దెబ్బతినడంతో అంతర్గత అసంతృప్తి బాగా పెరిగిపోయింది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకే తెలుగు తెలిసిన నాయకులకు పెద్దపీట వేశారు. మధుకర్ దశరథ్ నియామకం ద్వారా ఈ సమస్యలన్నీ తొలగిపోతాయని అధిబేటా భావిస్తోంది. కొత్త కూర్పు ఎంతవరకు సఫలమవుతుందనేది త్వరలోనే తేలనుంది. పార్టీ శ్రేణులు ఈ మార్పులను పూర్తిగా స్వాగతిస్తున్నాయి. అందరిలోనూ కొత్త ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తోంది. వరంగల్‌లో కీలక నేతను ఉంచడం వెనుక పెద్ద రాజకీయ లెక్కే ఉంది. ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్లగొండ జిల్లాల నేతలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలి. అక్కడి పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఎన్నికల నాటికి తిరుగులేని పట్టు సాధించాలి. అయితే కేవలం కొత్త నాయకులకు బాధ్యతలు ఇస్తేనే విభేదాలు పూర్తిగా సమసిపోవు. జిల్లాల నాయకత్వాన్ని అందరినీ కలుపుకొని పోవాలి. నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమించగలిగితేనే అసలైన మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. లేకపోతే పాత సమస్యలే మళ్లీ తలెత్తే ప్రమాదం ఉంది. దీన్ని గ్రహించే అధిష్టానం ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోంది. నాయకుల మధ్య సమన్వయం కుదిరితేనే విజయాలు సాధ్యమవుతాయి. కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు పెద్దఎత్తున సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందరినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రణాళికలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతాయో చూడాలి. వచ్చే ఏడాది ఎదురుకాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ కొత్త టీమ్‌కు అసలైన తొలి పరీక్ష. మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ అలాగే వరంగల్ ఖమ్మం నల్లగొండ జిల్లాల స్థానాలు కీలకం. ఓటర్ల నమోదు ప్రక్రియ అభ్యర్థుల సరైన ఎంపిక ప్రచారంలో సమన్వయం చాలా ముఖ్యం. ప్రతి దశలోనూ పార్టీ సంస్థాగత బలం ఏపాటిదో ఇట్టే బయటపడుతుంది. మరోవైపు ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక కూడా మరో పెద్ద సవాల్. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పరిధిలోనే ఇది ఉంది.

# ఖైరతాబాద్ ఉపఎన్నికలో కవిత పార్టీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఖైరతాబాద్ ఉపఎన్నిక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. దానం నాగేందర్ అనర్హత వేటుతో రాబోయే పోరు రంజుగా మారనుంది. ఈ నేపథ్యంలోనే కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన సంచలన ప్రకటన చేసింది. ఖైరతాబాద్ బరిలో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టనున్నట్లు స్పష్టం చేసింది. బంజారాహిల్స్ కార్యలయంలో జరిగిన మీడియా సమావేశంలో కవిత ఈ నిర్ణయం వెల్లడించారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టేందుకు ఈ నియోజకవర్గాన్ని తొలి వేదికగా ఎంచుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ రెండు పార్టీలు ఫామ్‌హౌస్ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ విన్యాసాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వనగరం అని గొప్పలు చెప్పుకునే నగరంలోనే దయనీయ పరిస్థితులు ఉన్నాయని ఆవేదన చెందారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వసతులు లేక చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని ధ్వజమెత్తారు. వైద్య రంగానికి బడ్జెట్‌లో కేవలం ఐదు శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని కవిత విమర్శించారు. బస్తీలు ప్రభుత్వ పాఠశాలలు ఆసుపత్రుల దుస్థితిపై తమ పార్టీ క్షేత్రస్థాయిలో పోరాడుతుందని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేన స్థాపించిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నిక కావడంతో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలోని ఈ కీలక నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా ప్రచార కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. బస్తీ ఓటర్లను నిరుద్యోగ యువతను ఉద్యమ శ్రేణులను ఏకం చేసే పనిలో పడ్డారు. విద్యా వైద్య రంగాల పునరుద్ధరణే ప్రధాన అజెండాగా ప్రజల్లోకి వెళ్తామని ప్రకటించారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసే బలమైన స్థానిక అభ్యర్థిని బరిలోకి దింపుతామన్నారు. పార్టీ వర్గాలు ఇస్తున్న ఈ సంకేతాలు ప్రత్యర్థుల్లో కలవరం రేపుతున్నాయి. కేవలం సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా క్షేత్రస్థాయి సమస్యల ఆధారంగా ప్రచారం




నిర్వహించాలని నిర్ణయించారు. యువతను ఆకర్షించే ప్రత్యేక వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేస్తున్నాయి. ఖైరతాబాద్ పోరు కాంగ్రెస్ బీజేపీ బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని అందరూ భావించారు. కానీ ఇప్పుడు ఈ కొత్త పార్టీ ఎంట్రీతో లెక్కలన్నీ పూర్తిగా మారిపోయాయి. కవిత పార్టీ పోటీ చేస్తుండటంతో సంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక రావడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. స్థానిక శ్రేణుల్లో కూడా స్పష్టమైన అభిప్రాయ భేదాలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటివరకు ఉన్న రాజకీయ అంచనాలు తలకిందులు అవుతున్నాయి. ప్రధాన పార్టీల వ్యూహకర్తలు తమ ప్రణాళికలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అన్ని పార్టీలు ఈ స్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజలకు చేరువ కావాలని భావిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కూడా తమ గళాన్ని గట్టిగా వినిపించాలని నిర్ణయించాయి. సాధారణ ప్రజల సమస్యలను ప్రస్తావిస్తూ ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. తక్కువ సమయంలోనే ప్రజల్లోకి బలమైన సందేశాన్ని తీసుకెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. యువత ఓటర్లే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణను అమలు చేసేందుకు తెలంగాణ రక్షణ సేన సిద్ధమవుతోంది. నిరుద్యోగ సమస్యపై ప్రధాన పార్టీలను నిలదీయాలని నిర్ణయించింది. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో పాత నాయకులు విఫలమయ్యారని ప్రచారంలో ఎత్తిచూపుతున్నారు. మార్పు కోరుకునే వారికి తమ పార్టీ మంచి ప్రత్యామ్నాయం అవుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో పాదయాత్రలు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని భావిస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక సభలు సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. నూతన రాజకీయ విధానాలతో ముందుకు వెళ్తామని పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రచారంలో దూకుడు పెంచేందుకు ఇప్పటికే పలు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ప్రతీ గడపకూ తమ పార్టీ అజెండాను చేరవేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేస్తున్నాయి. ఈ ఎన్నికల బరిలో నిలవడం ద్వారా తమ సత్తా చాటాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. ఖైరతాబాద్ గడ్డపై తలపడే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. అన్ని వర్గాల ఆమోదం పొందిన బలమైన నాయకుడిని బరిలో దించాలని కవిత భావిస్తున్నారు. త్వరలోనే అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ప్రచార వేగం మరింత పుంజుకుంటుంది. త్రిముఖ పోటీ అనుకున్న చోట చతుర్ముఖ పోటీ ఖాయం కావడంతో రాజకీయ ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ఏ చిన్న పొరపాటు చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ప్రతి అడుగు చాలా జాగ్రత్తగా వేస్తున్నాయి. స్థానిక ప్రజల నాడిని పట్టుకునేందుకు నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనుంది. ఫలితం ఎలా ఉంటుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ రాజకీయ పరిణామాలు భవిష్యత్తులో మరిన్ని మార్పులకు నాంది పలికే అవకాశం ఉంది. సరికొత్త వ్యూహాలతో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి.

# భారతదేశం గర్వించదగ్గ జాతిరత్నం మన్మోహన్

**మొదటిపేజీ తరువాయి**

నిలబెట్టారని పేర్కొన్నారు. ఆయన జ్ఞాపకార్థం దేశ రాజధాని ఢిల్లీలో సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ స్మారక పార్క్‌ను, ఆయన విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను సీఎం గుర్తుచేశారు.

**ఆర్థిక సంస్కరణలకు నాంది**

దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు నాయకత్వంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ కీలక సంస్కరణలు చేపట్టారని రేవంత్‌రెడ్డి తెలిపారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలను ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపించారని పేర్కొన్నారు. ఆర్థిక సలహాదారుగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఎన్నో బాధ్యతలు నిర్వహించారని సీఎం గుర్తుచేశారు. దేశ విదేశీ మారక నిల్వలు తీవ్రంగా క్షీణించిన సమయంలో ఆయన అనుభవంతో తీసుకొచ్చిన ఆర్థిక సరళీకృత విధానాలు దేశానికి కీలక మలుపుగా నిలిచాయని అన్నారు.

**పేదల కోసం కీలక చట్టాలు**

మన్మోహన్ సింగ్ హయాంలో పలు కీలక చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు అమల్లోకి వచ్చాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత హక్కు చట్టం, ఆదివాసీ హక్కుల చట్టం, భూసేకరణ-పునరావాస చట్టం వంటి వాటిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశ శ్రేయస్సు కోసం అనేక చట్టాలు తీసుకొచ్చిన మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. పేదల సంక్షేమం, దేశ ఆర్థిక ప్రగతి కోసం ఆయన చేసిన ఆలోచనలు, సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

**తెలంగాణ బిల్లుపై సంతకం**


తెలంగాణ చరిత్రను రెండు కీలక ఘట్టాలుగా




చూడొచ్చని రేవంత్‌రెడ్డి అన్నారు. నిజాం పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి కల్పించిన ఘట్టంలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాత్రను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని చెప్పారు. అదేవిధంగా ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో సాకారం చేసుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై మన్మోహన్ సింగ్ చేసిన సంతకాన్ని స్మారక పార్క్‌లో పదిలపరిచామని తెలిపారు. పార్క్‌ను సందర్శించే ప్రతి ఒక్కరికీ ఆయన స్వదస్తూరి సంతకం కనిపించేలా ఏర్పాటు చేశామని చెప్పారు. మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు వ్యక్తిగతంగా గౌరవంగా భావిస్తున్నానని సీఎం తెలిపారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థలకు కేంద్రంగా ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐఎస్‌బీ, అమెరికన్ కాన్సులేట్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్న ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహం, స్మారక పార్క్ ఏర్పాటు చేయడం సముచితమని పేర్కొన్నారు.

**భారతరత్న ఎందుకు ఇవ్వకూడదు?**

మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దేశం గర్వించదగ్గ జాతిరత్నాన్ని రాజకీయ అంశాల నేపథ్యంలో గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు. కొన్ని సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత దేశ ఆర్థిక ప్రగతికి, పరిపాలనా సంస్కరణలకు విశేష కృషి చేసిన మన్మోహన్ సింగ్ స్మారకం ఢిల్లీలో ఉండాలని సీఎం అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఈ అంశాలను తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, నవీన్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## దోస్త్ పల్లి నుంచి మహారాష్ట్ర నానీజ్ దమ్ వరకు 26 రోజుల పాదయాత్ర

**విశాలభారతి, జుక్కల్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం దోస్త్ పల్లిబంగారుపల్లి గ్రామ శివారులోని దక్షిణ భారత్ పీఠాధిపతి జగద్గురు స్వామి శ్రీ నరేంద్రాచార్యజీ మహారాజ్ తెలంగాణ ఉప పీఠం నుంచి మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా నానీజ్ ధామ్ శ్రీ క్షేత్ర రామానంద విభాగం వరకు 26 రోజుల భక్తి పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఉప పీఠం నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం తెలంగాణ ఉప పీఠం నుంచి మంగళవాయిద్యాలు, భజనలు, నామస్మరణల మధ్య పాదయాత్ర ఘనంగా ప్రారంభం కానుంది. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని పలు పవిత్ర ప్రాంతాల మీదుగా ఈ యాత్ర 26 రోజుల పాటు కొనసాగి, చివరి రోజు నానీజ్ ధామ్ చేరుకుని జగద్గురు స్వామి శ్రీ నరేంద్రాచార్యజీ మహారాజ్ ఆశీర్వాదాలు పొందనున్నారు. ఈ పాదయాత్రలో పాల్గొనే భక్తులు 26 రోజుల పాటు భగవన్నామ స్మరణ, భజనలు, ధ్యానం, సేవా భావంతో ఆధ్యాత్మిక ప్రయాణం సాగించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ యాత్ర ఆధ్యాత్మిక, సామాజిక చైతన్య భక్తి, ధర్మం, సనాతన సంప్రదాయాల పట్ల ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర ద్వారా పర్యావరణ పరిరక్షణ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ (భూమి ఉష్ణోగ్రత పెరుగుదల) పై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. ఈ పవిత్ర పాదయాత్రలో భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని, భక్తి భావంతో నామ స్మరణ చేస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని విస్తరించాలని నిర్వాహకులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# గణేశ్ నిమజ్జనాల్లో 13 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి**

సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నా భక్తులు మాత్రం ఉత్సాహం తగ్గకుండా గణేష్ నిమజ్జనాన్ని పూర్తి చేశారు. డప్పు చప్పుళ్లు, డీజే హోరులు, యువతీ యువకుల నృత్యాలతో వీధులన్నీ మార్మోగాయి. సెప్టెంబర్ 15న అనంత చతుర్దశి కావడంతో హైదరాబాద్ నగరంలో భారీగా గణేష్ విగ్రహాలు ట్యాంక్ బండ్ కు తరలివచ్చాయి. వేలాదిగా వచ్చి గణేష్ విగ్రహాలకు పటిష్టమైన భద్రత మధ్య పోలీసులు నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేశారు. హైదరాబాద్ లో ఫేమస్ అయిన ఖైరతాబాద్, బాలాపూర్ గణేషుడిని కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జనం పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం దాదాపు లక్షా ఇరవై నాలుగు వేల వినాయక విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించారు. అయితే తెలంగాణలోని వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో కొన్ని అనుకోని సంఘటనల కారణంగా ఒక ఎస్సై సహా 13 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే మరో 26 మంది గాయపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కే వెంకన్న గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈమేరకు వెంకన్న కుటుంబానికి అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ హామీ ఇచ్చారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం సైఫాబాద్ పోలీసుల గాలింపు చర్యలు చేపట్టారు. పఠాన్ చెరులో ఆరుగురు యువకులు గణేష్ నిమజ్జనంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఖైరతాబాద్‌లో ఒకరు, నిర్మల్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి డీజే సౌండ్స్ కారణంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈ వివరాలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా వెల్లడించారు. ఇళ్లలో, గేటెడ్ కమ్యూనిటీల్లో, అపార్ట్ మెంట్స్ లో కలిపి మూడున్నర లక్షల నుండి నాలుగు లక్షల మధ్య వినాయకులు ప్రతిష్ఠించారు. పోలీసులు ట్రాఫిక్ నిర్వహణతో పాటు భద్రతా చర్యలను కూడా నిరంతరం పర్యవేక్షించి



నట్లు డీజీపీ వివరించారు. పోలీసులు విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ నిమజ్జన వేడుకల సందర్భంగా జరిగిన దురదృష్టకర ప్రమాదాల్లో పదమూడు మంది ప్రాణాలు కోల్పోవడం, 26 మంది గాయపడటం తీవ్ర విషాదాన్ని నింపిందని అన్నారు. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్న తరుణంలో జరిగిన ఈ నష్టాలు అందరినీ కలచివేశాయి. ఎంతో సంతోషంగా సాగిన పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదంలోకి జారుకుంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన తీరని వేదనలో ఆ ఇళ్లన్నీ మూగబోయాయి. ప్రభుత్వ అధికారులు బాధితులకు తగిన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని పదే పదే హెచ్చరించినప్పటికీ ఈ ప్రమాదాలు జరగడం విచారకరం. భద్రతా సిబ్బంది ఎంతగానో శ్రమించి పెద్ద ఎత్తున జనసంద్రాన్ని నియంత్రించారు. అయినప్పటికీ కొన్ని దురదృష్టకర పరిణామాలు జరగడాన్ని ఎవరూ ఆపలేకపోయారు. ఉత్సవ కమిటీలు కూడా భక్తులకు తగు సూచనలు చేస్తూ వచ్చాయి. ప్రతి ఏటా జరిగే ఈ మహా ఉత్సవం ఎన్నో జ్ఞాపకాలను మిగులుస్తుంది. ఈసారి కూడా అదే రీతిలో ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. వర్షం కురుస్తున్న లెక్కచేయకుండా యువతీ యువకులు రోడ్లపైకి వచ్చి నృత్యాలతో హోరెత్తించారు. డీజే సౌండ్స్ మోతలతో నగరమంతా మార్మోగిపోయింది. నిమజ్జన ఘట్టం ముగిసేవరకు ఎలాంటి పెద్ద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ మళ్లింపులు సక్రమంగా అమలు చేయడం వలన ప్రజలకు పెద్దగా ఇబ్బందులు కాలేదు. పాత బస్తీలోని ప్రధాన వీధుల గుండా సాగిన శోభాయాత్ర కనులపండువగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు గణనాథుని దర్శించుకుని తరించారు. ప్రసాదాల వితరణ కూడా జోరుగా సాగింది. ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల స్థానంలో మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణ వేత్తలు చేసిన విజ్ఞప్తికి కొంతవరకు స్పందన లభించింది. భవిష్యత్తులో పర్యావరణాన్ని కాపాడుకోవడానికి అందరూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వచ్చే ఏడాది ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలని భక్తులు ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకుంటున్నారు. ఈసారి జరిగిన కొన్ని చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఏది ఏమైనా తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలు ముగిశాయి. వినాయకుడి నిమజ్జనం విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చూపిన చొరవ అభినందనీయం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు నిర్వహించడం నిజంగా గొప్ప విషయం. భక్తుల సహకారం కూడా ఈ ఉత్సవాల విజయానికి ప్రధాన కారణం అయింది. మళ్లీ రావయ్యా మా వినాయక అంటూ కన్నీటి వీడ్కోలు పలుకుతూ ప్రజలు తమ ఇళ్లకు చేరుకున్నారు.

## ఆర్ఎంపీలు పరిమితికి మించిన వైద్యం చేస్తే

# కఠిన చర్యలు

**అశ్వాపురం, విశాల భారతి :**

ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సకే పరిమితం అవ్వాలని పరిమితికి మించిన వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్వో శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో గల దోసపాటి నాగేశ్వరరావు గృహాన్ని సందర్శించిన ఆయన తొలుత దోసపాటి ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన స్థితిగతులను ఆయన కుమారుడు దోస్పాటి వెంకటేష్ అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఆయనకు ఆ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పుల్లారావు అనే వ్యక్తి జ్వరానికి వైద్యం చేస్తూ వాడిన ఇంజక్షన్లు, సెలేన్లను, మందులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధిగ్రస్తుడైన రోగికి స్టెరాయిడ్స్ వంటి మందులను వాడాడని, అవి అత్యంత ప్రమాదానికి దారి తీస్తాయని అని తెలిపారు. అటువంటి మందులను వాడడం వలన మనిషికి బీపీ, షుగర్లు పెరగడంతో పాటు ఎముకలు బలహీనపడి అవయవాలు పాడే అవకాశం ఉందన్నారు. గ్రామీణ వైద్యులు వారి శక్తి సామర్థ్యాలకు మించిన వైద్యాలు చేయొద్దని ఆయన సూచించారు. స్టెరాయిడ్స్ వాడి బలవంతన వీలైనంత త్వరతిగతిన వ్యాధులను తగ్గించేందుకు అధిక మోతాదులో ఉండే ఔషధాలు వాడకూడదన్నారు.

**ఆర్ఎంపి పై చర్యలు తీసుకుంటాం : డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ శ్రీధర్.**

ఓ రోగికి జ్వరం కు అత్యధిక మోతాదులో స్టెరాయిడ్ ఇంజక్షన్లు వాడి రోగి ఇబ్బందులపాలు అవ్వడానికి కారణమైన ఆర్ఎంపీపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్వో శ్రీధర్ తెలిపారు. ఆర్ఎంపి వైద్యంతో ఆరోగ్యం క్షీణించి హైదరాబాదులో చికిత్స పొందుతున్న దోసపాటి వెంకటేష్ లికిత పూర్వకంగా చేసిన ఫిర్యాదును స్వీకరించిన ఆయన సదరు గ్రామీణ వైద్యుడు పై



కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదేవిధంగా ప్రజలు వ్యాధులు సంభవించిన సమయాలలో ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో గల ఆసుపత్రిలో అధునాతనమైన మందులు ఉన్నాయని, నిపుణులైన వైద్యులు పరీక్షించి వ్యాధికి సంబంధించిన మందులను ఇచ్చి వ్యాధులను నయం చేస్తారన్నారు. వ్యాధి తీవ్రత తగ్గకపోతే మణుగూరు, భద్రాచలం వంటి ప్రభుత్వ పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని అక్కడ అన్ని విధాల పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యం చేస్తారని ఆయన తెలిపారు. ప్రజలు గ్రామీణ వైద్యుల వద్ద ఎక్కువ కాలం వైద్యం చేయించుకుని ఇబ్బందుల పాలు కావద్దని ఆయన తెలిపారు. నేడు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాతనే నిపుణులైన వైద్యులు చికిత్సలు చేస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేసే గ్రామీణ వైద్యుల పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ విధమైన అర్హత లేని వ్యక్తులు రాసే ప్రిస్క్రిప్షన్ పై మెడికల్ షాపుల నిర్వాహకులు మందులు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫార్మసి అధికారి పాయం శ్రీనివాస్, స్థానిక మండల వైద్యాధికారి రామలక్ష్మి, బి కృష్ణయ్య ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- **వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయాలంటే హరితహారం విస్తరించాలి**
- **పాఠశాల ఆవరణలో నీడనిచ్చే మొక్కలు నాటిన పర్యావరణ ప్రేమికుడు పేర్ల గణేష్ ముదిరాజ్**

**కురవి, విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పర్యావరణ ప్రేమికుడు పేర్ల గణేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ఆహ్వానం మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నీడనిచ్చే పలు మొక్కలను ఆయన స్వయంగా తీసుకువచ్చి నాటారు.ఈ సందర్భంగా పేర్ల గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో పాటు అతివృష్టి, అనావృష్టి, అధిక ఉష్ణోగ్రతలు వంటి ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. పర్యావరణ కాలుష్యం, అడవుల నరికివేత తదితర కారణాలతో వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తెలిపారు. పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు సహకరించిన పేర్ల గణేష్ ముదిరాజ్‌కు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.






# ఏకగ్రీవమైన సహకార సంఘం ఎన్నికలు

**అశ్వాపురం, విశాల భారతి :**

అశ్వాపురం మండలంలోని గౌతమీ నగర్ కాలనీలో శనివారం జరిగిన మణుగూరు భారజల కర్మాగార ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. డైరెక్టర్లుగా కులుకుల వెంకటేశ్వర్లు, అచ్చు, గట్ల శ్రీనివాసులు, మార్తి జానకి రాములు, జి లింగా, వెలిసేటి మహేష్, మెరిసే బ్యుల, ప్రియాంక మొత్తం ఏడుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన డైరెక్టర్లు ఈనెల 28 సోమవారం అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా అయ్యేందుకు విశిష్టమైన కృషి చేసిన వారిలో ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, బాదావత్ సీతారాములు, రన్ హుస్సేన్, రామిరెడ్డి, గడ్డం రమేష్, రాయల రాజేష్, పెంటి సురేష్, వెంకటేశ్వర్లు, బేతి రమేష్, జి అన్వేష్ కృషి చేయడంతో పాటు గెలుపొందిన డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ రిజిస్టర్ ఎ వి రాజశేఖర్ రెడ్డి వ్యవహరించారు.

## బంగారి గూడెంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
- లబ్ధిదారులకు రూ.1.12 లక్షల విలువైన చెక్కుల అందజేత



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు కురవి మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా గోప నాయక్ ఆధ్వర్యంలో శనివారం బంగారి గూడెంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో చికిత్స పొందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ధారావత్ శ్రావణికి రూ.17,000, భూక్యా సత్తికి రూ.40,000, బానోతు ప్రీతికి రూ.15,000, బానోతు మరోనీకి రూ.40,000 చొప్పున మొత్తం రూ.1,12,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బడావత్ మోతీలాల్, భూక్యా నరేష్, ధారావత్ సకృతో పాటు బంచరాయి తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు లూనావత్ విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తట్టుపల్లిలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

- డబుల్ బెడ్రూం ఇళ్లకు మెరుగైన విద్యుత్ సౌకర్యం
- పనులకు శంకుస్థాపన చేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** కురవి మండలం తట్టుపల్లి గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్ శంకుస్థాపన చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు విద్యుత్ సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తయితే డబుల్ బెడ్రూం ఇళ్లకు విద్యుత్ సరఫరా మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీలా మంగీలాల్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త యాకన్నతో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం రేంజ్‌లో అక్రమ కలప స్వాధీనం

- భీమ్లాతండాలో అటవీశాఖ అధికారుల దాడులు
- రూ.1.01 లక్షల విలువైన కలప పట్టివేత



**బయ్యారం విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** బయ్యారం అటవీ రేంజ్ పరిధిలో అటవీ శాఖ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీపురం సెక్షన్ పరిధిలోని పాండిపాంపుల బీట్ భీమ్లాతండా గ్రామంలో శనివారం అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 0.3674 ఘన మీటర్ల టేకు కలప, విలువ రూ.57,059, అలాగే 0.4436 ఘన మీటర్ల నాన్‌టేకు కలప, విలువ రూ.43,996గా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.1,01,055గా అధికారులు తెలిపారు. అక్రమంగా కలప నిల్వ చేసిన ఘటనపై పీఓఆర్ నంబర్ 35/41, తేదీ 26092026 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అటవీ సంపదను అక్రమంగా తరలించడం, నిల్వ చేయడంపై నిఘా పెంచామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## వీబీజీ రాంజీ పథకం, ఎల్నీనోపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ






**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** వీబీజీ రాంజీ పథకం, ఎల్నీనో పరిస్థితులపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం మహబూబాబాద్‌లోని పీఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, ఎల్నీనో ప్రభావంతో వ్యవసాయ రంగంలో తలెత్తే పరిస్థితులపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వారు వివరించారు. గ్రామ పంచాయతీల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), గృహ నిర్మాణ శాఖ పీడీ పురుషోత్తం, డీఆర్‌డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి రేవంత్, అదనపు డీఆర్‌డీఓ మల్లీశ్వరి, పంచాయతీరాజ్ ఈఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన సత్యవతి రాథోడ్

**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఒంటికొమ్ము అప్పారెడ్డి మాతృమూర్తి సుశీల మృతి చెందడంతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా మరిపెడ మున్సిపాలిటీ 13వ వార్డుకు చెందిన ముదిరెడ్డి లక్ష్మారెడ్డి మాతృమూర్తి, నరేష్‌రెడ్డి నాయనమ్మ కమలమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లిన సత్యవతి రాథోడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ ఓడీఎస్ఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బొడ శ్రీనునాయక్, కొంపల్లి వేణుగోపాల్‌రెడ్డి, కొంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- జిల్లాలో సంస్కృతి, ఆలయ, ప్రకృతి, పర్యావరణ పర్యాటకానికి అపార అవకాశాలు
- పర్యాటక ప్రదేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ;** మహబూబాబాద్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. జిల్లాలో సుమారు 49 శాతం అటవీ ప్రాంతం ఉందని, ఇందులో ప్రకృతి సౌందర్యంతో కూడిన అనేక అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. సంస్కృతి, ఆలయ, పర్యావరణ, ప్రకృతి పర్యాటకానికి జిల్లాలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహబూబాబాద్ మండలం కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కోలాటం, చిరుతల రామాయణం, బతుకమ్మ, బోనాలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు.కంబాలపల్లి పురాతన శివాలయాన్ని కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోశారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై పాఠశాల విద్యార్థులు రూపొందించిన చిత్రాలు, ఛాయాచిత్రాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కురవి వీరభద్రస్వామి ఆలయం, కందికొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నరసింహులపేట వెంకటేశ్వరస్వామి ఆలయం, బయ్యారం పెద్ద చెరువు, మత్తడి, భీమునిపాదం, గుంజేడు ముసలమ్మ తల్లి ఆలయం, పురాతన ఆలయాలు, ఏడు బావులు, కంబాలపల్లి పెద్ద చెరువు, గ్రీన్‌హిల్స్ క్యాంపింగ్, పులిమడుగు క్యాంపింగ్, బయ్యారం జలపాతం తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సామాజిక మాధ్యమాల ప్రభావశీలులు, సినీ ప్రముఖులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, ప్రజాప్రతినిధులు, యూట్యూబర్లు, విద్యార్థులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పర్యాటక ప్రాంతాల ద్వారా గ్రామాలు, జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పర్యాటక ప్రాంతాలను స్థానిక ప్రజలు తమవిగా భావించి పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రకృతికి ఎలాంటి విఘాతం కలగకుండా తగిన నిబంధనలు పాటిస్తూ అటవీ ప్రాంతాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్థానిక ప్రజలు, సర్పంచులు, అటవీ అధికారులు, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా జిల్లా ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటిస్తూ ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పాఠశాలల్లో యువ పర్యాటక క్లబ్బులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా క్లబ్బుల ద్వారా విద్యార్థులు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంచుకుని వాటి విశిష్టతను ఇతరులకు తెలియజేయాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించే సమయంలో నిబంధనలు పాటించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా సంస్కృతి గురించి సంక్షిప్తంగా పుస్తకం రూపొందించిన రమేష్‌ను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పర్యాటక నోడల్ అధికారి శ్రీమన్నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ఇన్‌చార్జి లోకల్ బాడీస్ పురుషోత్తం, అటవీ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్, గ్రామ ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు, స్థానిక గ్రామ కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు, వివిధ పాఠశాలల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన పిల్లలను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ వినోద్‌కుమార్, శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ నితీష్, జిల్లా అధికారులు, స్థానిక సర్పంచ్ చిరకా వసంత-ఉపేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కమటం యాకన్న, గ్రామ ప్రజలు కె. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన సమాజం



- రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా చర్యలు చేపట్టాలి
- సిఆర్పీలకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలోని జైపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 17 క్లస్టర్లకు చెందిన 34 మంది సామాజిక వనరుల వ్యక్తులకు (సిఆర్పీలు) ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణలో సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంతో పాటు ఘనజీవామృతం, జీవామృతం, బీజామృతం, దశపర్ణి కషాయం తదితర ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆధునిక సాంకేతిక విధానాలతో ఎలా తయారు చేసి వినియోగించాలనే అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జైపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని ఆధునిక జీవామృతం తయారీ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా రైతులు, సిఆర్పీలకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ అందించడంతో పాటు అవసరమైన చోట సబ్సిడీ సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ, విస్తరణ అధికారులు, ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ప్రయోజనం చేకూరేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి. మరియాన్న, శాస్త్రవేత్త, విభాగాధిపతి మల్యాల ప్రశాంత్, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామారావు, నాగేశ్వరరావు, స్థానిక తహసిల్దార్ వివేక్, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



- జ్వర బాధితులను గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలి
- గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రవి రాథోడ్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు, జ్వర బాధితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడ మండలం గుంజేడు గ్రామానికి చెందిన సిరబోయిన విక్రాంత్, తండ్రి శ్రీధర్‌కు సెప్టెంబర్ 21న డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కావడంతో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాధితుని నివాసాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్, వైద్య సిబ్బందితో కలిసి బాధితుని ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరుగుదలను గుర్తించి వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. చుట్టుపక్కల ఇళ్లలోనూ దోమల నివారణ మందు పిచికారీ చేయించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను అరికట్టేందుకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామూహిక పారిశుద్ధ్య చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు. కొత్తగూడ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, ఇతర కాలానుగుణ జ్వరాల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. జ్వర బాధితులను గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించి, పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించాలని ఆదేశించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి తదితర లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని డాక్టర్ బి. రవి రాథోడ్ ప్రజలకు సూచించారు. దోమల ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించడం ద్వారా డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని గణనీయంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్‌తో పాటు వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## బతుకమ్మ గ్రౌండ్‌కు శంకుస్థాపన,సీసీ కెమెరాల ప్రారంభం

- మోగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్

**చౌటుప్పల్,విశాల భారతి:** మున్సిపాలిటీ లక్కారం గ్రామ 8వ వార్డులో రానున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామ కచేరీ దగ్గర ఉన్న గ్రౌండ్‌ను సీసీ గ్రౌండ్‌గా మార్చే పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ మొగుదల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపనతో పాటు 8వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, యాదాద్రి జిల్లా ఫిషరీస్ చైర్మన్ పాశం సంజయ్ బాబు, చౌటుప్పల్ యస్ ఐ అజయ్ భార్గవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బద్రి గాలయ్య, మాజీ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్, చింతల సాయిలు, మాజీ సర్పంచ్ కానుగు బాలరాజు, సీసీ కెమెరాల దాత పాశం కృష్ణయ్య, నాయకులు కడుపు వెంకటేష్, లందగిరి భీమయ్య, వార్డు అధ్యక్షులు పాశం శ్రీనివాస్, కార్యదర్శి బద్రి బాలరాజు, మాజీ వార్డు సభ్యులు గుండెబోయిన నర్సింహా, గోపనబోయిన నర్సింహా, ఆకుల యాదిరెడ్డి తదితరులు, మహిళా సంఘం అధ్యక్షురాలు గుండెబోయిన కళమ్మ, దంతిక మణెమ్మ, సురకంటి యాదమ్మ, బాలాగోని లక్ష్మి తదితర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్కాపురం ప్రభుత్వ మిగులు భూమిని పేదలకు పంచాలని,సీపీఎం డిమాండ్




**చౌటుప్పల్,విశాల భారతి:** మండలంలోని దండు మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 617, 114లో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సీపీఎం చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జహంగీర్ హాజరై మాట్లాడుతూ.. గ్రామంలో భూమిలేని పేదలు అనేక మంది ఉన్నారని, వారికి జీవనాధారం కల్పించేందుకు ప్రభుత్వ మిగులు భూమిని గుర్తించి వెంటనే పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూ పంపిణీ ప్రక్రియను చేపట్టి అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతల సుదర్శన్, తడక మోహన్, మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, పొట్ట శ్రీనివాస్, అంతటి అశోక్, మీసాల శీను, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, కొండే శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే మన దేశ భవితకు పునాదులు



**మోతె సెప్టెంబర్ 26 విశాల భారతి ;** ఉపాధ్యాయులే మన దేశ భవితకు పునాదులు వేస్తున్నారని యం పి డి ఓ సందీప్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా పరిష్యత్ ఉన్నత పాఠశాల లో జరిగిన ఉపాధ్యాయ దినోత్స వం 2026 27 విద్యా సంవత్సరానికి మండల విద్యాధికారి శ్రీ గోపాల్ రావు అధ్యక్షతన జరిగిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు అనంతరం అయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యాబోధనలో అమలు పరుస్తున్న వినూతన కార్యక్రమాలను సేవలను గుర్తింపు కు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా మండల స్థాయిలో గుర్తించడం జరిగిందని ఏలే శ్రీనయ్య జెడ్పిహెచ్ఎస్ మామిళ్లగూడెం ఫిజికల్ సైన్స్ , శ్రీమతి. ఉమా వతి జడ్.పి.హెచ్.ఎస్ ఉర్లుగొండ మ్యాథమెటిక్స్ , టి. రవీందర్ ఎస్ జి టి పి ఎస్ నరసింహాపురం , కే .సంధ్య ఎస్జీటీ యుపిఎస్ అన్నారుగూడెం , జి. శ్రీనివాస్ ఎస్ జి టి యు పి ఎస్ సర్వారం , ఎల్. ప్రవీణ్ కుమార్ ఎస్ జి టి పి ఎస్ కొత్తగూడెం సిఆర్పి కే శ్రీనివాస్ సిరికొండ ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించడం జరిగిందని చెప్పారు

## ఘనంగా 131 వ ఐలమ్మ జయంతి వేడుకలు



**తిరుమలగిరి, విశాల భారతి :** మండలంలోని తొండ గ్రామంలో రజక సంఘం అధ్యక్షుడు ఓడపల్లి నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఓడపల్లి సోమనర్సయ్య, పొరెళ్ల లక్ష్మయ్య, ఓడపల్లి వెంకన్న,పోరల్ల వెంకన్న, వాడపల్లి అశోక్, వాడపల్లి సోమయ్య, పోరెల్ల బుచ్చయ్య, గ్రామ పెద్దలు భూతం రవి, ఏసిరెడ్డి, వేల్పుల వెంకటయ్య , చింతకింది సోమనారాయణ, కవిత, సుంచు వాసు తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ ఎస్పీ శబరీష్

- సిబ్బంది విధులు, గ్రామాల సందర్శనలపై ఎస్పీ ఆరా
- రాత్రి గస్తీ పటిష్టం చేయాలి
- నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా
- ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన
- పోలీస్–ప్రజల సత్సంబంధాలు పెంపొందించాలి
- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్







**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ కేసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను పరిశీలించారు. స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఐ క్రాంతి కిరణ్‌తో సిబ్బంది విధుల కేటాయింపు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి రోజువారీ విధులు, గ్రామాల సందర్శనలు, బీట్ విధులు, గ్రామ పోలీస్ అధికారి విధులు, రాత్రి గస్తీ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ స్థానిక సమస్యలు, నేర ప్రవృత్తులు, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని ఎస్పీ సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు గ్రామస్థులతో సమన్వయం పెంచుకొని, ముఖ్యమైన పరిణామాలు, నేరాలకు సంబంధించిన సమాచారం, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ఆదేశించారు. రాత్రి గస్తీని మరింత పటిష్టం చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని తెలిపారు. అత్యవసర సహాయ నంబర్ 112కు వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించి బాధితులకు వేగంగా పోలీస్ సహాయం అందించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిఘా పెంచి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలను కలిసే సమయాన్ని తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఈ సమయంలో ప్రజల సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రతపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసులకు తెలియజేసేలా నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందిస్తూ బాధితులతో మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండి, విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును ప్రదర్శించాలని ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సిబ్బందికి సూచించారు.

## పోలీసులపై దాడులకు ఉపేక్ష లేదు

- తానంచర్ల మాజీ సర్పంచ్ సహా ఆరుగురి అరెస్ట్



**మరిపెడ విశాల భారతి:** విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడులు, బెదిరింపులు, విధులకు ఆటంకం కలిగించే చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ స్పష్టం చేశారు.మరిపెడ మండలం తానంచర్లలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఈ నెల 23-24 అర్ధరాత్రి డీజే సౌండ్స్‌తో న్యూసెన్స్ చేస్తున్నారన్న డయల్ 112 సమాచారంతో ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది అక్కడికి వెళ్లారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డుపై నుంచి పక్కకు వెళ్లాలని సూచిస్తున్న పోలీసులతో కొందరు వాగ్వాదానికి దిగినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను మరిపెడ-సూర్యాపేట జాతీయ రహదారి (NH365)పై అడ్డంగా నిలిపి సుమారు అరగంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించినట్లు పేర్కొన్నారు. పోలీసులు ట్రాక్టర్‌ను పక్కకు తరలించినప్పటికీ కొందరు రోడ్డుపై బైఠాయించి మరోసారి రాకపోకలకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు.ఈ ఘటనపై మాజీ సర్పంచ్, డీజే నిర్వాహకులతో సహా 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన పోలీసులు ఇప్పటివరకు తానంచర్ల మాజీ సర్పంచ్ దిగజర్ల ముఖేష్‌సహా ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.అరెస్టయిన వారిలో దిగజర్ల ముఖేష్ (మాజీ సర్పంచ్), దయ్యాల విక్రం, దిగజర్ల గణేష్, సీత అంజి, జానీ హుస్సేన్, పాశం కృష్ణ ఉన్నారు. అనుమతులు లేకుండా డీజేలు నిర్వహిస్తే పరికరాలను స్వాధీనం చేసుకుని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం, పోలీసుల విధులకు అడ్డుపడటం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## బంజారా గ్రామంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



**దేవరుప్పుల విశాల భారతి:** దేవరుప్పుల మండలం బంజారా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. గర్భిణీ దశ నుంచి శిశువుకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఉన్న మొదటి వెయ్యి రోజులు ఎంతో కీలకమని తెలిపారు. ఈ కాలంలో శిశువు మెదడు అభివృద్ధిలో సుమారు 80 శాతం జరుగుతుందని, అందువల్ల గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు ప్రతిరోజూ ఒక పూట సంపూర్ణ భోజనం తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రత్నమాల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, ఆశా కార్యకర్త అనూష, ఏఎన్ఎం సుభద్ర, అంగన్‌వాడీ కార్యకర్త యాదమ్మతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.


## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



**దేవరుప్పుల విశాల భారతి:** దేవరుప్పుల మండల తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

## జుజుర్ తండాలో సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

- రూ.26 వేల సహాయనిధి చెక్క అందజేసిన డాక్టర్ వీరన్న నాయక్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు కురవి మండలం జుజుర్ తండాలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధరావత్ వీరన్న నాయక్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ధరావత్ లక్ష్మి భర్త కిసాన్‌కు మంజూరైన రూ.26 వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరన్న నాయక్ మాట్లాడుతూ.. గత రెండున్నర సంవత్సరాల్లో జుజుర్ తండాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా సుమారు రూ.2 కోట్ల మేర ప్రయోజనం ప్రజలకు చేకూరిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సీసీ రోడ్లు, సెంటర్ లైటింగ్, సీఎం సహాయనిధి, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం, పంటల బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ధరావత్ నరేష్, ఉప సర్పంచ్ ధరావత్ శరత్, ఉపాధ్యక్షుడు మోతిలాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బానోత్ శ్రీరామ్, వార్డు సభ్యులు బానోత్ రవి, తండా నాయకులు ధరావత్ మాన్‌సింగ్, బానోత్ జెథా, గ్రామ యువజన అధ్యక్షుడు బానోత్ సురేందర్, మనీష్ శర్మ, ధరావత్ భద్రు, ధరావత్ బిచ్య, ధరావత్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## రిలే నిరాహార దీక్ష విరమింపజేసిన ఆదివాసి రైతులు

- ఎట్టకేలకు దిగొచ్చిన రెవిన్యూ అధికారులు పంచనామ పత్రాలు అందజేత
- హర్షం వ్యక్తం చేసిన ఆదివాసి రైతులు



**వాజేడు సెప్టెంబర్ 26 విశాల భారతి**

ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో ఎడజర్ల పల్లి గ్రామపంచాయతీ ఆదివాసి రైతులు తహసిల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షలు శనివారనికి ఐదో రోజు విరమింప చేశారు. ఐదో రోజు దీక్షలకు జి ఎస్పీ, ఏ ఎస్పీ, తుడుందెబ్బ ఆదివాసీ సంఘాలు మద్దుతూ తెలిపాయి. ఐదో రోజు అయినా రెవిన్యూ అధికారులు న్యాయం చేయకపోవడం తో తహసీల్దార్ కార్యాలయం ముందు మోకాళ్ళ పై కూర్చొని రైతులు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ లను సస్పెండ్ చేయాలనీ నినాదాలు చేశారు. ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సర్వ హక్కులు ఉన్నప్పటికీ న్యాయం కోసం మోకాళ్ళ పై కుర్చుని న్యాయం చేయమని బిచ్చం ఆడుకునే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది అని అయన అన్నారు. దీనితో తాసిల్దార్ కార్యాలయం ముందు ఉదృత వాతావరణం ఏర్పడడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రాము, కబ్జా చేసిన గిరిజనేతరుడిని, ఆదివాసీల పట్టా భూముల్లోకు వెళ్లొద్దని చెప్పడం జరిగింది. గిరిజన రైతులకు ఉన్న అసైన్మెంట్ రికార్డు లను పరిశీలించి పంచనామా రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. గిరిజనుల భూములు గిరిజనులకే చెందుతాయని 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులకు గిరిజనుల భూములు చెల్లావని తహసీల్దార్ శ్రీనివాస రావు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ పంచనామా రిపోర్ట్ రైతులకు అందజేస్తూ . నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేసినారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, వాజేడు మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు, ఉపాధ్యక్షుడు యాలం అశోక్,మీడియా అధ్యక్షుడు పాయం అజయ్, కార్యదర్శులు తల్లడి ప్రసాద్, కోరం మనోజ్, కంబాలపల్లి హరినాద్, ఆదివాసులు తల్లడి సంతోష్‌పాల్గొన్నారు.

## గణిత సామర్థ్యాల పెంపునకు నాణ్యమైన బోధన



- విద్యార్థుల్లో ప్రాథమిక గణితంపై పట్టు పెంచాలి: అనంతరావు

**మరిపెడ, విశాల భారతి:** విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని మరిపెడ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అనంతరావు సూచించారు. శనివారం జడ్పీహెచ్ఎస్ మరిపెడలో రెండో గణిత కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మరిపెడ, నర్సింహులపేట, చిన్న గూడూరు మండలాల గణిత ఉపాధ్యాయులతో అనంతరావు మాట్లాడారు. కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం వంటి ప్రాథమిక గణిత ప్రక్రియలపై విద్యార్థులకు పట్టు కల్పించడంతో పాటు నిర్దేశిత లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎఫ్ఏ 1, ఎఫ్ఏ 2 పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను సమీక్షించారు.డీఆర్‌పీ రాయిపెల్లి యాకయ్య ఎల్ఐపీ, రెమిడీయల్ టీచింగ్, పీఆర్ఎస్ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ప్రాథమిక గణిత సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రతిరోజూ రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎస్ఆర్‌పీ బయగాని రామ్మోహన్ తరగతి గదిలో ఆంగ్ల భాషను సమర్థవంతంగా వినియోగించే విధానాలను వివరించారు.నర్సింహులపేటకు చెందిన గణిత ఉపాధ్యాయుడు వరకుమార్ 9వ తరగతి విద్యార్థులకు నమూనా పాఠ్య బోధన నిర్వహించారు. అనంతరం ఎస్ఏ 1 ప్రశ్నాపత్రాల రూపకల్పనపై ఉపాధ్యాయులతో కార్యక్రమం నిర్వహించారు.మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వీరారం గణిత ఉపాధ్యాయుడు వెంకటయ్యను, ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన నర్సింహులపేట గణిత ఉపాధ్యాయుడు కోట శేఖర్ కుమార్తె రోహిణిని కాంప్లెక్స్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ బయగాని రామ్మోహన్, డీఆర్‌పీ రాయిపెల్లి యాకయ్యతో పాటు వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాండవుల గుట్టను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**విశాలభారతి, భూపాలపల్లి :** పాండవుల గుట్ట, బుగులోని వేంకటేశ్వరస్వామి ఆలయం సహా జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక, అటవీ శాఖల ఆధ్వర్యంలో పాండవుల గుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాండవుల గుట్టపై ప్రాచీన వర్ణచిత్రాలు, కోనేరు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గుట్ట అభివృద్ధికి రూ.కోటి కేటాయించామని, కాలినడక మార్గంలో భక్తులకు నీడ కల్పించే నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రాకపోకలకు అనువుగా సుమారు రూ.10 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నామని, టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. గెస్ట్‌హౌస్‌లు, ట్రెక్కింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాండవుల గుట్టను కొడవటంచ నరసింహస్వామి ఆలయం, మైలారం గుహలు, నవాబుపేట కోటగుళ్లు, ఘన్‌పూర్, లక్నవరం, రామప్ప, సమ్మక్క-సారలమ్మ, మల్లూరు నరసింహస్వామి, కాళేశ్వరం ప్రాంతాలతో అనుసంధానించి పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రచారం చేస్తూనే వాటిని పరిరక్షించుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. పర్యాటక రంగంతో స్థానికులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలు పడవేయకుండా పరిశుభ్రత పాటించాలని ఎస్పీ సంకీర్త్ సూచించారు.

## దుబాయ్‌లో ఆలూర్ వాసి మృతి

- మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని కుటుంబ సభ్యుల వేడుకోలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



**నిజామాబాద్ జిల్లా విషయాల భారతి / ఆర్మూర్:** ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఆలూర్ మండల కేంద్రానికి చెందిన గడ్డం చరణ్ కరుణాకర్ (44) ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ నెల 14న దుబాయ్ వెళ్లిన కరుణాకర్.. అక్కడికి వెళ్లిన వారం రోజుల్లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.మృతుడు కరుణాకర్‌కు భార్య సునీత (44), ఇద్దరు కుమార్తెలు కావేరి (20), కావ్య (14) ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కరుణాకర్ మృతితో భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు .ఈ సందర్భంగా మృతుడి భార్య సునీత మాట్లాడుతూ.. తమ భర్త మృతదేహాన్ని దుబాయ్ నుంచి స్వగ్రామానికి తీసుకురావడానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు సహకరించాలని కోరారు. అంతేకాకుండా తమ కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.కరుణాకర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో పాటు బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం, ప్రవాస భారతీయులు, దాతలు ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. దుబాయ్ లో మృతి చెందాడు అన్న వార్త వినరాగానే కుటుంబ సభ్యులు బంధువులు కన్నీరు మున్నీరు అయ్యారు. శవం రాక కోసం బంధువులతో పాటు కాలనీవాసులు గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి
- ఎన్నికల సంఘాన్ని సమూలంగా సంస్కరించాలి
- సిపిఐ (ఎం )జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు



**మోతె సెప్టెంబర్ 26 విశాల భారతి;** ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా కొనసాగుతున్న జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని సిపిఐ (ఎం )జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల సంఘం పనితీరు పై ప్రజల్లో విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా పని చేసేలా సమూల సంస్కరణలు చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించాలని డిమాండ్ చేశారు.

## అంతర్ రాష్ట్ర రవాణాకు అంతరాయం



**వాజేడు సెప్టెంబర్ 26 విశాల భారతి;** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి పెద్ద గొల్ల గూడెం 163వ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఇసుక వాగు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు వరదఉదృతకు కొట్టుకు పోయింది. దీంతో ములుగు జిల్లా వాజేడు మండలంలో 23 గ్రామాల మధ్య మరియు అంతర్ రాష్ట్ర చతిస్గడ్, మహారాష్ట్ర, జాతీయ రహదారి పై రవాణాకు అంతరాయం కలిగింది . విషయం తెలుసుకున్న వాజేడు, పేరూరు ఎస్సైలు ఇసుక వాగు వద్ద సిబ్బందిని, రహదారి పై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది.

## చిప్పరాళ్ల బండ తండాలో ఘనంగా పోషణ మాసం

- తల్లులు, పిల్లల ఆరోగ్యంపై అవగాహన



**దేవరుప్పుల విశాల భారతి:** దేవరుప్పుల మండలం చిప్పరాళ్ల బండ తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం, ఈసీసీఈ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధిపై తల్లులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సావిత్రి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బిడ్డ తల్లి గర్భంలో పడినప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఉన్న కాలం ఎంతో కీలకమని, ఈ సమయంలో తల్లి సరైన పోషకాహారం తీసుకోవడంతో పాటు బిడ్డకు అవసరమైన పోషకాహారం అందించాలని తెలిపారు.సర్పంచ్ దరవత్ సుజాత మాట్లాడుతూ తల్లులందరూ అంగన్‌వాడీ కేంద్రానికి క్రమం తప్పకుండా రావాలని, పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు విజయ, స్వరూప, పాఠశాల ఉపాధ్యాయురాలు స్రవంతి, అంగన్‌వాడీ టీచర్ సత్యలక్ష్మి, ఆశా కార్యకర్త మంజుల, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషపై విద్యార్థుల్లో మమకారం పెంచాలి

- వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు





**దేవరుప్పుల విశాల భారతి:** దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సౌదామని సాహిత్య సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింత ప్రసాద్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు "ఆధునిక కాలంలో తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు" అనే అంశంపై పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకున్నారు. పోటీల్లో ప్రథమ బహుమతిని ముత్యం సాత్విక, ద్వితీయ బహుమతిని భౌరోజు సాత్విక, తృతీయ బహుమతిని చింతకింది హనీష్ సాధించారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా చింత ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి, తెలుగు భాషా సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మాతృభాషను ప్రేమించి, చదవడం, రాయడం ద్వారా తెలుగు భాషను భావితరాలకు అందించాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్, అంకాల సోమయ్య, నక్క సురేష్, జోగు సుదర్శన్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జ్వరంతో బాధపడుతూ మహిళ మృతి

**రాజేంద్రనగర్, విశాల భారతి :** జ్వరంతో బాధపడుతున్న ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాబుల్‌రెడ్డి నగర్‌కు చెందిన రమేష్‌కుమార్ (24) భార్య సరస్వతి ఈ నెల 23వ తేదీ నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆమెను బాబుల్‌రెడ్డి నగర్‌లోని వంశీ ఫార్మాకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు పరీక్షించి చికిత్స అందించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే అదే రోజు సాయంత్రం సరస్వతికి తల తిరగడంతో రమేష్‌కుమార్ తిరిగి సుమారు 6.30 గంటలకు వంశీ ఫార్మాకు తీసుకెళ్లాడు. వైద్యుడు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం వెంటనే మరో ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో ఆమెను జోయ్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- **సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం**
- **మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్.**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** తెలంగాణ వీరవనిత, రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జిల్లా ఎస్పీ డా. శబరీష్. పి, ఐపీఎస్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సామాజిక అన్యాయం, పెత్తందారీ దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట పటిమ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా తన హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా చైతన్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ఎంతో గొప్పదని తెలిపారు. ఆమెను స్మరించుకోవడంతో పాటు సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలిచి, ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం

- **జగ్య తండాలో బాలగని శ్రీనివాస్‌కు ఘన స్వాగతం**



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కురవి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బాలగని శ్రీనివాస్ తొలిసారిగా జగ్య తండాకు విచ్చేసిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన బాలగని శ్రీనివాస్‌కు పార్టీ శ్రేణులు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రాము నాయక్, మండల నాయకులు కరుణాకర్ జ్యోతి నాయక్, డోర్నకల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొర్ని అనిల్, దయ్యాల శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సక్రం నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు చంద్రు నాయక్ , మాజీ అధ్యక్షులు బాలు నాయక్ ,కురవి ఆలయ ధర్మకర్త శక్రు నాయక్, వార్డు మెంబర్ జితేందర్ స్వరూప నాయక్, యూత్ అధ్యక్షుడు లచ్చిరాం నాయక్, ప్రవీణ్ నాయక్, సోషల్ మీడియా ఇన్చార్జి సంతోష్ నాయక్, వీరన్న నాయక్ మరియు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దూదిమట్ల లింగన్న పార్థివదేహానికి సత్యవతి రాథోడ్ నివాళి


- **కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన దూదిమట్ల లింగన్న మృతి చెందడంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు శ్రీమతి సత్యవతి రాథోడ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. లింగన్న మృతి విషయం తెలుసుకున్న ఆమె శనివారం అయ్యగారిపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా లింగన్న పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లింగన్న మృతి పట్ల సత్యవతి రాథోడ్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆమె సూచించారు. సత్యవతి రాథోడ్ పరామర్శకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై లింగన్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి మాజీ ఎంపీపీ బజ్జూరి ఉమా పిచ్చిరెడ్డి, జిల్లా బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, బోడ శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ బుడగల లక్ష్మయ్య, వార్డు సభ్యుడు బుడుగు తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

- **రోడ్డు ప్రమాదంలో గాయపడిన బానోతు రంగ్యకు పరామర్శ**



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కురవి మండలం జగ్య తండాకు చెందిన గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు బానోతు రాంగోపాల్ తండ్రి బానోతు రంగ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బాలగని శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి రాము నాయక్, మండల నాయకులు కరుణాకర్ జ్యోతి నాయక్, డోర్నకల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొర్ని అనిల్, దయ్యాల శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సక్రం నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చంద్రు నాయక్, మాజీ అధ్యక్షుడు బాలు నాయక్, కురవి ఆలయ ధర్మకర్త శక్రు నాయక్, వార్డు మెంబర్ జితేందర్ స్వరూప నాయక్, యూత్ అధ్యక్షుడు లచ్చిరాం నాయక్, ప్రవీణ్ నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సంతోష్ నాయక్, వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

- **ఐలమ్మ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి**



**మణుగూరు, విశాలబారతి :** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మణుగూరు మండలంలోని హనుమాన్ టెంపుల్ వద్ద ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని, మహిళా శక్తికి ఆమె అందించిన స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యురాలు కొలపిన్ని మానస, నాయకులు జీవి, కూచిపూడి బాబు, సీతయ్య, బత్తుల సుజాత, కుంజా రంగయ్య, లోడిగా సత్యనారాయణ, ముక్కెర లక్ష్మణ్, ఘనబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విశాల భారతి వరుస కథనాలకు ఫలితం..!

- **ఎమ్మెల్యే సహకారంతో ఎస్సీ బాలికల హాస్టల్ తరలింపునకు అధికారుల ఆదేశాలు**
- **దళితుల పోరాటానికి దక్కిన విజయం**
- **అన్ని సౌకర్యాలున్న భవనానికి తరలింపు**

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. విద్యార్థినులకు సరిపడా వసతులు లేని ప్రస్తుత ప్రైవేట్ భవనంపై "విశాల భారతి" వరుస కథనాలు, దళిత నాయకులు, విద్యార్థి సంఘాల ఫిర్యాదులు, ఆందోళనల నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఈ నెల 21న హాస్టల్‌ను అన్ని సౌకర్యాలు ఉన్న మరో అద్దె భవనానికి తరలించాలని ఆదేశాలు జారీ చేశారు.

**సమస్యపై వరుస కథనాలు.. స్పందించిన అధికారులు.**

ప్రస్తుతం కొనసాగుతున్న భవనం విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడంతో పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలు సైతం పూర్తిస్థాయిలో




దళిత బాలికలంటే ప్రభుత్వానికి అంత నిర్లక్ష్యమా

లేవని గతంలో ఆరోపణలు వచ్చాయి. దీనిపై "విశాల భారతి" వరుస కథనాలను ప్రచురించడంతో పాటు దళిత నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ఎమ్మెల్యే సహకారంతో యజమాని ఒప్పందం.**

హాస్టల్ తరలింపులో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. రామచంద్రు నాయక్ ప్రత్యేకంగా సహకరించి, ప్రస్తుత భవన యజమానిని ఒప్పించినట్లు సమాచారం. దీంతో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ భవనంలో హాస్టల్ నిర్వహణకు మార్గం సుగమమైంది.



OFFICE OF THE DIST.SCHEDULED CASTES DEVELOPMENT DEPARTMENT
MAHABUBABAD (E-mail: dscdomahabubabad@gmail.com)
Adress:S-17,IDOC,Mahabubabad

From
Sri. K. Srinivasarao, M.Com,
Dist.SC Development Officer(FAC),
Mahabubabad

To
The Mandal Parishad Development Officer,
Kuravi Mandal,Mahabubabad Dist.
The Station House Officer,
Kuravi Mandal,Mahabubabad Dist

Lr.No.A1/40/2025.Dated: -09-2026

Sub: SCDD – Mahabubabad District – SC Girls Hostel, Kuravi functioning in a private building – Insufficient accommodation for the sanctioned strength – Proposal to shift to a new rented building (rent fixed) on or before 23-09-2026 – Notice issued to the existing owner – Owner obstructing the process – Request for cooperation from Station House officer, Kuravi & The Mandal Parishad Development Officer Kuravi through the functioneries of Grama Panchayath,kuravi —Regarding.

Ref:- 1. GO Ms.No.63 Fin( Expr.PD Dept Dt: 18-04-2011
2. G.O Ms.No. 61 (EBS.X dpt Dt: 19-05-2016
3. G.O Ms.No. 119 (EBS.X) Dept Dt: 19-09-2016
4. Application of HWO, SC Girls hostel Kuravi dt: 05.05.2025
5. Willingness letter given by Sri R. Srinivas, Owner of the House bearing No. 5-113/5/A Dt: 08-05-2025
6. Report submitted by the ASWO, Mahabubabad Dt: 09-05-2025
7. Rental Committee meeting held on 15-06-2026
8. Note Orders of the District Collector, Mahabubabad on 19-06-2026

&&&&&

Your kind attention to the references cited. It inform that the SC Girls Hostel, Kuravi is presently functioning in a private rented building. The existing building is not sufficient to accommodate the sanctioned strength of the hostel and is also not adequate for providing the required facilities to the inmates.

In view of the above, a suitable private building bearing H.No.5-113/5/A, owned by Sri R. Srinivas, has been identified for shifting the SC Girls Hostel, Kuravi. As well as the owner has given his willingness to provide the said building for running the hostel. The matter was placed before the Rental Committee, which held its meeting on 15-06-2026, and the rent was fixed as per the prescribed procedure. The proposal was also submitted to the District Collector, Mahabubabad, and orders were obtained on 19-06-2026.

**అన్ని సౌకర్యాలున్న భవనానికి తరలింపు.**

ప్రభుత్వం నూతన హాస్టల్ భవనం నిర్మించే వరకు విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఉన్న మరో అద్దె భవనంలోకి హాస్టల్‌ను తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు ఎంపీడీవో, పోలీస్ శాఖతో పాటు సంబంధిత అధికారుల సహకారం తీసుకోవాలని ఆదేశాల్లో సూచించారు.

**దళితుల విద్యార్థి సంఘ నాయకుల పోరాటానికి దక్కిన విజయం.**

ఎస్సీ బాలికల హాస్టల్ సమస్య పరిష్కారం కోసం దళిత నాయకులు, విద్యార్థి సంఘాలు చేసిన పోరాటానికి ఇది ఫలితమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థినుల భద్రత, విద్య, వసతి సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

**ప్రజల హర్షం.. అధికారులకు కృతజ్ఞతలు.**

హాస్టల్ సమస్యపై స్పందించి తరలింపునకు చర్యలు చేపట్టిన అధికారులకు, సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై విద్యార్థినుల వసతి, భద్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని కోరారు. అదే సమయంలో ప్రభుత్వం శాశ్వత ఎస్సీ బాలికల హాస్టల్ భవనం నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



- **ఆమె ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి**
- **జిల్లా రెవెన్యూ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి**

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని జిల్లా రెవెన్యూ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి అన్నారు. చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో శనివారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ ఆమె ప్రదర్శించిన ధైర్యం, సాహసం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆమె ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు సమష్టిగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సీహెచ్. సాయిశ్రీజ, వసతి గృహ సంక్షేమ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సిబ్బంది, జిల్లాలోని రజక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# గుండ్రాతిమడుగులో సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

- **రూ.24,500 చెక్కు అందజేసిన గార్లపాటి భరద్వాజ్ రెడ్డి**
- **పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**
- **అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం**
- **కురవి మండల కాంగ్రెస్ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి**

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**



అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మండల కాంగ్రెస్ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి అన్నారు. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును శనివారం లబ్ధిదారుడికి అందజేశారు. డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన కొత్తపల్లి ఉప్పలయ్యకు రూ.24,500 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కురవి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి అందజేశారు. చెక్కును అందజేసిన అనంతరం ఉప్పలయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరద్వాజ్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్య ఖర్చుల విషయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతోందన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని భరద్వాజ్ రెడ్డి కోరారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎలిమిశెట్టి రామకృష్ణ, ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు సభ్యుడు గాండ్ల వినయ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# రైతుల సంక్షేమాభివృద్ధికి నావంతు కృషి

- **సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్**

**చౌటుప్పల్,విశాల భారతి:** రైతుల సంక్షేమాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ అన్నారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ రోడ్డు రైతు వేదిక వద్ద ఒకటవ వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్, వైస్ చైర్మన్ పర్నే శివారెడ్డి, డైరెక్టర్ సురుకంటి లక్ష్మమ్మ యాదిరెడ్డి ని శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం వారి ఆర్థిక పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో రైతుల సంక్షేమం, అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించడమే తమ సంఘం ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. చౌటుప్పల్ మండలంలోని గ్రామాలను పిలాయిపపల్లి కాలువతో సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తా అన్నారు. పిల్లాయిపల్లి కాలువకు మరమ్మత్తులు చేయించి ప్రతి ఎకరాకు సాగునీరు అందిచేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టి భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మమ్మల్ని ఘనంగా సన్మానించిన కౌన్సిలర్ కోసనం రాకేష్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్,మాజీ కౌన్సిలర్ కొరగోని లింగస్వామి, బండమీది మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊదరి నరసింహ, దోనకొండ కృష్ణ, నల్ల గణేష్ యాదవ్, ఉడత నరసింహ, బోరెం శేఖర్ రెడ్డి, మారుపాకల స్వామి, మట్టపల్లి శ్రీశైలం,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- **నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ**
- **మోగదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్**



**చౌటుప్పల్,విశాల భారతి:** పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్,కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్లు చింతల ఉమామహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, మహమ్మద్ హన్ను భాయ్, కోఆప్షన్ మెంబర్ బాబా షరీఫ్, నాయకులు దేపరాజు, ఊడుగు రమేష్, బత్తుల దాసు తదితరులు పాల్గొని "వీరనారి చాకలి ఐలమ్మకు జోహార్లు" అంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ దీప, జూనియర్ అకౌంటెంట్ మహేష్, శ్రీనాథ్, వార్డు ఆఫీసర్లు వినీల, ప్రవళిక, బిల్ కలెక్టర్లు మరియు కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముదిరెడ్డి కమలమ్మ కు మాజీ మంత్రి సత్యవతి నివాళి



**మరిపెడ విశాల భారతి:** మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన ముదిరెడ్డి లక్ష్మా రెడ్డి( నరేశ్ రెడ్డి నాయనమ్మ) గారి మాతృమూర్తి కమలమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. శనివారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కమలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డి, నరేష్ రెడ్డిలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆమె వెంట మాజీ ఓ డీ ఎస్ ఎం ఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, కొంపల్లి వేణు గోపాల్ రెడ్డి, వె ర్మరెడ్డి , రవీంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో 56 ఏళ్ల వ్యక్తి అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన 56 ఏళ్ల మనోజ్ కుమార్ అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలమాకుల గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు భోజనం చేసిన అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని తమ్ముడు సత్తేందర్ కుమార్ పరిసర ప్రాంతాల్లో వెతికాడు. బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఆరా తీసినా ఎలాంటి సమాచారం లభించలేదు. మరుసటి రోజు ఉదయం మనోజ్ కుమార్‌తో కలిసి పనిచేసే నరేష్‌ను కుటుంబ సభ్యులు విచారించారు. 24వ తేదీ రాత్రి సుమారు 8.50 గంటల సమయంలో పాలమాకులలోని తిరుమల వైన్స్ వద్ద మనోజ్ కుమార్ మద్యం సేవించి మత్తులో ఉన్నట్లు నరేష్ తెలిపాడు. మనోజ్‌ను ఇంటి వద్దకు తీసుకెళ్లి వదిలేస్తామని తాము చెప్పినప్పటికీ, తానే ఇంటికి వెళ్లిపోతానని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు నరేష్ వివరించాడు. అయితే మనోజ్ కుమార్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అదృశ్యమైన సమయంలో మనోజ్ కుమార్ సుమారు 4 అడుగుల 8 అంగుళాల ఎత్తు, చామనచాయ రంగులో ఉండి, నీలం రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆయనకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు మాట్లాడటం వచ్చునని పేర్కొన్నారు. మనోజ్ కుమార్ అదృశ్యం విషయంలో తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువుల వద్ద, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి మనోజ్ కుమార్ ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# పంట మార్పిడితో కూరగాయల సాగును పెంచాలి

- మిషన్ వైవిధ్యం ద్వారా రైతులకు అవగాహన
- కూరగాయల సాగుతో అధిక ఆదాయం.. స్వయం ఉపాధికి బాటలు
- ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**మహబూబాబాద్ జిల్లా**
**విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**



ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ కూరగాయల సాగును విస్తరించాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు మిషన్ వైవిధ్యం కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామాన కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కూరగాయల సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆశించిన స్థాయిలో సాగు జరగడం లేదన్నారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా సుమారు 10 వేల ఎకరాల్లో కూరగాయలు సాగు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం సుమారు 2 వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతున్నట్లు తెలిపారు. రైతులు కూరగాయల సాగును పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గ్రామీణ యువత, స్వయం సహాయక సంఘాలు కూరగాయల సాగును స్వయం ఉపాధి మార్గంగా ఎంచుకోవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న పలు ప్రోత్సాహకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో రైతు వాంకుడోతు దోసిలాల్ సాగు చేస్తున్న కూరగాయల క్షేత్రాన్ని అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగులో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. దోసిలాల్ తాత్కాలిక పందిరి విధానంలో కాకర సాగు చేస్తూ వానాకాలం, యాసంగి సీజన్లలో ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలకు ప్రత్యామ్నాయంగా కాకర, చిక్కుడు తదితర కూరగాయలను సాగు చేస్తూ దోసిలాల్ బయ్యారం మండల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఎత్తు మడులు, పందిరి సాగు, సేంద్రీయ పద్ధతులు, పంట కుంట వంటి మేలైన విధానాలను పాటించడం ద్వారా కూరగాయల సాగులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందించే టమాట, పచ్చి మిరప, వంకాయ, బెండ, బీర, సొరకాయ, కాకర, దొండ, పొట్లకాయ, మునగ, చిక్కుడు, గోరుచిక్కుడు, దోసకాయ, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, క్యాబేజీ, కాలీఫ్లవర్, ఆకుకూరలు, కంద, చేమ, ఉల్లి తదితర కూరగాయలను రైతులు సాగు చేయాలని అధికారులు సూచించారు. కూరగాయల సాగులో ప్రోట్రేలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేపపిండి, ఆముదం పిండి వినియోగం, వేపనూనె పిచికారీ, పసుపు రంగు అట్టల వినియోగం, సిఫారసు చేసిన ఎరువుల వాడకం వంటి పద్ధతులను పాటించాలని సూచించారు. పందిరి విధానంలో కూరగాయల సాగుతో పాటు టమాటలో ట్రెల్లిస్ పద్ధతిని అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న, మండల వ్యవసాయ అధికారి కె. రాజు, రైతులు దోసిలాల్, వెంకటేష్‌తో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు పి. రమేష్, జి. నాగరాజు, బి. రెడ్యా, పి. అఖిల్, ఎం.డి. ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుల స్వాగత వేదిక

**సికింద్రాబాద్, విశా లభారతి :** గణనాధుల నిమజ్జనము విడ్కోలు సందర్భంగా ఆహ్వాన వేదికల నుండి పూలు జల్లుతూ సంప్రదాయ కూచిపూడి నృత్యాలతో స్వాగతం పలికిన క బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ,భాస్కర్ గిరి అంబాల రాజు ,అశ్విని ,ఆకారం రమేష్ ,ముఠా గణేష్,హనుమంతు ముదిరాజ్ ,సాయ దత్తు ,మహంకాళి ప్రభూ ,సందీప్ ముదిరాజ్ ,తదితరులు

## భక్తి.. సేవా స్ఫూర్తి.. మానవత్వానికి ప్రతీకగా అన్నప్రసాద వితరణ



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మన్సూరాబాద్ పెద్ద చెరువులో గణనాథుని నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లను ఎల్.బి.నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి పరిశీలించారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపడుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం మన్సూరాబాద్ పెద్ద చెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరువు ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులను జక్కిడి రఘువీర్ రెడ్డి అభినందించారు. సేవా కార్యక్రమానికి అండగా రూ.20 వేల ఆర్థిక సహాయం,అన్నప్రసాద వితరణ వంటి సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించడంలో భాగంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.20,000 (అక్షరాల ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాలకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.74 వేలకు లడ్డూ కైవసం చేసుకున్న యంపల్ల రాణి శ్రీకాంత్ రెడ్డి దంపతులు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని ఓం శక్తి నగర్ కాలనీలో (బీరప్ప టెంపుల్) ప్రతిష్ఠించిన గణనాధుని నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కాలనీ వాసులు 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు లడ్డూ వేలం పాట నిర్వహించారు. పెద్ద లడ్డూ యంపల్ల రాణిశ్రీకాంత్ రెడ్డి దంపతులు రూ.74 వేలకు కైవసం చేసుకున్నారు. చిన్న లడ్డూ టేకుల పద్మ రాజిరెడ్డి రూ.66,666కు, కళశం గోదలా కల్పన శ్రీనివాస్ రెడ్డి రూ.50 వేలకు, శాలువా, దోతిని వల్లాస్ సౌమ్య శివ రూ.10,116కు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 12వ వార్డు కౌన్సిలర్ కొండిగారి త్రిలోక్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఆకుల మమత ఆనంద్ కుమార్, 20వ వార్డు కౌన్సిలర్ మంద జయమ్మ మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లడ్డు కైవసం చేసుకున్న వారు మాట్లాడుతూ నవరాత్రులు పూజలు అందుకున్న విగ్నేశ్వరుని లడ్డును కైవసం చేసుకున్నందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. విగ్నేశ్వరుని ఆశీస్సులు ఈ కాలనీ వాసులపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యంపల్ల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పుల కృష్ణ గౌడ్, సలహాదారులు కొర్ర భాస్కర్ నాయక్, ఉపాధ్యక్షులు చీమర్ల సురేష్, దుగ్గి మల్లికార్జున్, గోదాల శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ రాజు నాయక్, కార్యవర్గ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ ఎన్నికల్లో బీఎస్ఎఫ్ అభ్యర్థిగా స్నేహ

- జనరల్ సెక్రెటరీగా గెలిపించాలని విజ్ఞప్తి
- విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి






**సైబరాబాద్ విశాలభారతి:** హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఎన్నికల్లో జనరల్ సెక్రెటరీ పదవికి బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ తరఫున స్నేహ వంకుడోతు పోటీ చేస్తున్నారు. వరంగల్ జిల్లాలోని గిరిజన గ్రామానికి చెందిన ఆమె జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యాభ్యాసం అనంతరం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసి, ప్రస్తుతం హెచ్‌సీయూలో సామాజిక శాస్త్రంలో మాస్టర్స్ చేస్తున్నారు. రిజర్వేషన్ల వల్లే తనలాంటి ఆదివాసీ, బహుజన విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభించాయని, వారి హక్కుల కోసం విద్యార్థి సంఘం ద్వారా పోరాడుతానని స్నేహ పేర్కొన్నారు. బహుజనుల స్వయంప్రతిపత్తి రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ ఆమెను అభ్యర్థిగా నిలబెట్టినట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. జనరల్ సెక్రెటరీగా ఎన్నికైతే ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు మెస్, క్యాంటీన్ ధరలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళలు, దివ్యాంగులు సహా అందరికీ సురక్షిత, సమ్మిళిత క్యాంపస్ కోసం పనిచేస్తామని, విద్యార్థులకు జవాబుదారీగా ఉండేలా బహిరంగ సమావేశాలు నిర్వహిస్తామని బీఎస్ఎఫ్ తెలిపింది. సెప్టెంబరు 28న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో స్నేహ వంకుడోతుకు ఓటు వేసి గెలిపించాలని విద్యార్థులను కోరింది.

## జగ్య తండాలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



- రూ.1.14 లక్షల ఆర్థిక సాయం అందజేత
- సంక్షేమ పథకాలతో తండాలో హర్షం

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

కురవి మండలం జగ్య తండాలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగని శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి బాదావత్ రాము నాయక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లూనావత్ పంతులకు రూ.42,500, బాదావత్ చందనకు రూ.16,500, గుగులోతు స్వాతి ప్రవీణ్‌కు రూ.15,000, బానోతు సుజాత శ్రీనుకు రూ.40,000 చొప్పున మొత్తం రూ.1,14,000 విలువైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

**సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రయోజనం.**

గత రెండున్నర సంవత్సరాల్లో జగ్య తండాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా సుమారు రూ.5 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని గ్రామస్తులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సీసీ రోడ్లు, సెంటర్ లైటింగ్, సీఎం రిలీఫ్ ఫండ్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం, పంటల బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు తదితర పథకాలతో ప్రజలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమం, తండా అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు.

**నాయకులు, ప్రజాప్రతినిధుల హాజరు**

ఈ కార్యక్రమంలో మండల నాయకులు కరుణాకర్, జ్యోతి, కురవి ఆలయ ధర్మకర్త శక్రు నాయక్, ఉప సర్పంచ్ బాదావత్ రవి నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బాదావత్ చంద్రు నాయక్, ఉపాధ్యక్షుడు గోపాల్ నాయక్, వార్డు సభ్యులు బాదావత్ పులి పర్సు నాయక్, లూనావత్ స్వరూప జితేందర్, బానోతు నరేష్ నాయక్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బాలు నాయక్, మాజీ ఎంపీటీసీ సక్రాం నాయక్, యూత్ అధ్యక్షుడు లచ్చిరాం నాయక్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి సంతోష్ నాయక్, మొదలుగూడెం సర్పంచ్, ఉప సర్పంచ్ శ్రీధర్, డోర్నకల్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి కొర్ని అనిల్, వెంకన్న, గ్రామ నాయకులు వీరన్న నాయక్, గుగులోతు రాములు, పంతులు, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరే మైసమ్మ చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కిస్మత్‌పూర్‌లోని ఆరే మైసమ్మ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. రజక సోదరుల కోరిక మేరకు కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ తన స్వంత ఖర్చులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సమాజం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, వారి త్యాగాలను స్మరించుకునే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు శేఖర్ ముదిరాజ్ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులు, ఇతరుల సహాయం లేకుండా స్వంత ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు పట్ల రజక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ విగ్రహం ఆమె ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు భీమార్జున రెడ్డి, మహాలింగం, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగేష్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, ఉపాధ్యక్షులు నరేష్ యాదవ్, పవన్ సాయి, ఎస్. శ్రీనివాస్, నాగరాజు, స్వామి, గణేష్, ఈగ లక్ష్మణ్, కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపల్ రజక సంఘం అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు నీలగిరి రాజ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు పరుపుగళ్ల రాజు, యాదయ్య, వెంకటేష్, కిషన్, శ్రీనివాస్, సంతాపురం బాలరాజ్, నీలగిరి భరత్‌తో పాటు రజక సంఘం సభ్యులు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు.

## లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించిన జడ్జి




**విశాలభారతి, ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం రోజు లీగల్ ఎయిడ్ క్లినిక్ సెంటర్ ను ప్రారంభించిన సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ విడిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామస్తుల కృషి





**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులందరూ మమేకమై శ్రీ ఆంజనేయ స్వామి అభివృద్ధికి తోడ్పడుతున్నారు. యాచారం మండలం నస్దిక్ సింగారం గ్రామంలోని ఆలయ దైవ కార్యాలకు స్థలం లేకపోవడంతో గ్రామస్తులంతా కలిసి రెండు గుంటల భూమిని కొనుగోలు చేసి గుడి ఆవరణ, ముందున్న స్థలంలో మొరము నింపి స్థలాన్ని చదును చేసి గుడి అభివృద్ధికి తోడ్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోడ కృష్ణ, ఉప సర్పంచ్ వన్నాడపురవీందర్ రెడ్డి, చింతపల్లి వరప్రసాద్ రెడ్డి వార్డ్ మెంబర్లు కడారి జంగయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## దొరల గుండెల్లో వణుకు పుట్టించిన చాకలి ఐలమ్మ

- భూస్వామ్య అరాచకాలపై ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం : సీపీఐ నేతలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** భూస్వాముల దోపిడీ, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ఆయుధం పట్టి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 2లోని సీపీఐ కార్యాలయంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దొరల దౌర్జన్యాలకు ఎదురొడ్డి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ఐలమ్మ కౌలుకు సాగు చేస్తున్న భూమిలో పండిన పంటను స్వాధీనం చేసుకునేందుకు దేశ్‌ముఖ్ వందల మందిని పంపినప్పటికీ ఆమె ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు ఆమె ఇంటిని తగులబెట్టి, పంటను దోచుకున్నా, కుటుంబంపై తీవ్ర వేధింపులకు పాల్పడినా ఐలమ్మ పోరాట పంథాను వీడలేదన్నారు. పాలకుర్తి, జనగామ, ఉమ్మడి వరంగల్ ప్రాంతాల్లో రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు, విసునూరు రామచంద్రారెడ్డి వంటి భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి తరానికి చాకలి ఐలమ్మ పోరాట చరిత్రను తెలియజేసి, ఆమె స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా, మండల కార్యవర్గ సభ్యులు మాధవరెడ్డి, కాటి అరుణ, వట్టి నవనీత, పేరాల గోపి, వినోద్ నాయక్, సుజాత, ఆవుల యాదగిరి, దుపం నిరంజన్, గణేష్, శోభన్, అలివేల, శంకర్ నాయక్, సరిలాల్, ఈశ్వరయ్య, మధు, నన్నేసాబ్, సాయిలు, రవి, బిచ్చు నాయక్, వెంకట్ నాయక్, రాములు, కావేరి, సంధ్య, ప్రవీణ్, సుధాకర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గం

- పలు అంశాలపై చర్చ.. మార్కెట్ అభివృద్ధిపై ఇష్టాగోష్టి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం శనివారం సాయంత్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తొర్రూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీకి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మార్కెట్ కమిటీ పాలకవర్గంతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మార్కెట్ కమిటీ కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు పలు విషయాలను ఎమ్మెల్యేకు వివరించారు.

## బ్రాహ్మణపల్లిలో గణేష్ లడ్డూ రూ.2.35 లక్షలు

- లడ్డు దక్కించుకున్న ఎలిమినేటి రజిత మల్లారెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్మెట్ :** తుర్కయాంజాల్ మున్సిపాలిటీ 1పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో భాగ్యనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు గణేష్ లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరకు గ్రామానికి చెందిన ఎలిమినేటి రజిత మల్లారెడ్డి రూ.2 లక్షల 35 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. భక్తి విశ్వాసాలతో లడ్డూను దక్కించుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాస్థాయికి ఎంపికైన పిఎం శ్రీ నంది వనపర్తి క్రీడ ఆణిముత్యాలు

- అభినందనలు తెలిపిన ఉపాధ్యాయ బృందం

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాపీట్ లో గురువారం నిర్వహించిన జోనల్ లెవెల్ కబడ్డీ వాలీబాల్ టోర్నమెంట్ లో యాచారం మండలంలోని పిఎం శ్రీ నంది వనపర్తి జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ఎస్ జిఎఫ్ అండర్ 14 కబడ్డీ, అండర్ 17 వాలీబాల్ క్రీడా పోటీలలో అత్యంత ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఎంపికలో అండర్ 14 వాలీబాల్ విభాగంలో కే శ్రీరామ్, కబడ్డీ విభాగంలో ఎం విష్ణు, అండర్ 17 వాలీబాల్, వై అఖిల్,కబడి విభాగంలో ఎన్ అజయ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ శాస్త్రి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ ను, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ క్రీడలలో మునుముందు మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్ రాథోడ్, తెలుగు పండితులు వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# ఇనామ్‌గూడలో గణనాథుడికి ఘన వీడ్కోలు





- భక్తులతో కలిసి మల్‌రెడ్డి సందడి..
  ఇనామ్‌గూడ చెరువు అభివృద్ధికి హామీ



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనామ్‌గూడలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకలు భక్తి, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ఇనామ్‌గూడ చెరువు పరిసరాలు భక్తుల సందడి, యువత ఆటాపాటలు, మహిళల బతుకమ్మ సంబరాలతో పండుగ వాతావరణాన్ని తలపించాయి. నిమజ్జన వేడుకల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని స్థానికులు, యువతతో కలిసి ఉత్సవాల్లో ఉత్సాహంగా మమేకమయ్యారు. భక్తులతో కలిసి కాసేపు స్టెప్పులేస్తూ సందడి చేశారు. ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకల ప్రాంగణంలో మరింత సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. భక్తులతో కలిసి ఆటాపాటల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

**అధికారులకు సన్మానం**

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేసిన అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సన్మానించి అభినందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో విధులు నిర్వహించిన అధికారుల సేవలను ప్రశంసించారు.

**చెరువుకు పర్యాటక హంగులు**

ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ చెరువులను ఇప్పటికే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అదే తరహాలో ఇనామ్‌గూడ చెరువును కూడా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. చెరువు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వినాయక నిమజ్జనంతో నవరాత్రి ఉత్సవాలకు ముగింపు పలికినా.. స్థానికులతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉత్సాహంగా పాల్గొన్న క్షణాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాల సర్పంచ్లు ప్రజా పతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీలో బీహార్ డీఎస్పీలకు ఆరు రోజుల ఇన్‌సర్వీస్ శిక్షణ ముగింపు






**రాజేంద్రనగర్, విశాల భారతి :** తెలంగాణ పోలీస్ అకాడమీలో బీహార్ పోలీస్ అకాడమీకి చెందిన 54 మంది డీఎస్పీలకు నిర్వహించిన ఆరు రోజుల ఇన్‌సర్వీస్ శిక్షణ కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. సెప్టెంబర్ 21 నుంచి 26 వరకు కొనసాగిన ఈ శిక్షణలో నేర నియంత్రణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక మోసాలపై అధికారులు అవగాహన పొందారు. ముగింపు కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రాష్ట్రాల పోలీసు అధికారుల మధ్య అనుభవాలు, విధానాల పరస్పర మార్పిడికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక దర్యాప్తు విధానాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక మోసాలు వంటి ప్రత్యేక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అభిలాష బిస్త్ తెలిపారు. నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఇప్పటివరకు 47 బ్యాచ్‌లకు సుమారు 7 వేల మంది పోలీసు, ఎక్సైజ్ అధికారులకు శిక్షణ అందించినట్లు వివరించారు. సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి ఏఐ ఛాంపియన్స్, జాతీయ నేర రికార్డుల సంస్థ, పోలీసు పరిశోధన-అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొన్న బీహార్ డీఎస్పీలు తమ అనుభవాలను పంచుకున్నారు. శిక్షణతో పాటు హైదరాబాద్‌లోని గోల్కొండ, రామోజీ ఫిల్మ్ సిటీ, చార్మినార్, ట్యాంక్‌బండ్ ప్రాంతాలను సందర్శించడం ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు, 54 మంది బీహార్ డీఎస్పీలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నహీర్, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాల చాకలి ఐలమ్మ

- భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం
- పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ. రిటైర్డ్ జిహెచ్‌ఎం ఎంఈఓ పి మహేందర్.



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జిహెచ్‌ఎం ఎంఈఓ పోచం భావి మహేందర్ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేక అనిచివేతలకు, అనేక కష్టాలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాటం చేసిన త్యాగశీలి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కౌలు భూమి వ్యవసాయం చేస్తూ వంటను దోపిడికి ప్రయత్నించిన దొరలను ధైర్యంగా ఎదిరించి నిలబడి తన హక్కుల కోసం పోరాడిన వీర వనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. నేటి సమాజం చాకలి ఐలమ్మ ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు.

## యూనివర్సిటీలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.చ. విద్యాసాగర్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆమె సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలిచారు. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, పేద రైతులు మరియు కూలీలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె పోరాడారు. ముఖ్యంగా తమకు సాగు హక్కు ఉన్న భూమిపై హక్కును కాపాడుకోవడానికి ఆమె చూపిన ధైర్యం, ఆత్మగౌరవం తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. నాటి నిజాం పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న దోపిడీ, వెట్టిచాకిరీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం మహిళల్లో, ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ తన హక్కుల కోసం నిలబడిన ఆమె ధైర్యసాహసాలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. చాకలి ఐలమ్మ జీవితం సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వం, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆమె ఆశయాలను స్మరించుకోవడంతో పాటు సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

## గణేష్ మండపాల్లో సందడి.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి




**నాచారం సెప్టెంబర్ 26 విశాల భారతి :** మల్లాపూర్: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడి ఆశీస్సులు పొందారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పన్నాల దేవేందర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పన్నాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు భక్తి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు వాసుదేవ్ గౌడ్, కుంతి కృష్ణ, పాండు, ప్రవీణ్, దయాకర్ రెడ్డి, జయరాజ్, సంజు రాజ్, ఉస్మాన్, జీకే రమేష్,తానాజీ రావు, రోహన్, పవన్, కృష్ణ, గణేష్, ముఖేష్, డీజే చిన్న, మహిళా కార్యకర్తలు తులసి, లావణ్య, విజయ, పింకీ, సంగి తదితరులతో పాటు కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

**ముషీరాబాద్,విశాల భారతి:** సంస్కృతి సాంప్రదాయాలతో ప్రతి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకొని తుర్కపల్లి మండలం రుస్తాపురం గ్రామంలో యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణేష్ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గణేష్ చారి, వల్లభోజు నరసింహ చారి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గణనాథులను ఏర్పాటు చేసుకోవడం చాలా గొప్పతనమన్నారు. వినాయకుని కృపతో దేశ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వల్లందాస్ విగ్నేష్, రమేష్ గౌడ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకం




- భూమికోసం భుక్తి కోసం
  వెట్టి చాకిరి విముక్తి కోసం
- పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్
  సి నారాయణ రెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం బలోపేతమైందని, తద్వారా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంపిణీ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ 1895లో జన్మించి 1985లో మరణించిన వీరనారి చాకలి ఐలమ్మ తన జీవితంలో అనేక కష్టాలను, అణచివేతలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాడారని తెలిపారు. పాలకుర్తి ప్రాంతంలో కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేస్తూ, తన పంటను దోపిడీ చేసేందుకు ప్రయత్నించిన దొరల ఎదుట ధైర్యంగా నిలబడి తన హక్కుల కోసం పోరాడిన వీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మాత్రమే కాకుండా, నేటి తరానికి దిక్సూచిగా నిలిచిన స్ఫూర్తిదాత అని మల్లేష్ యాదవ్ కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తితో యువత తప్పుడు మార్గాలకు దూరంగా ఉండి, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజయ్, దశరథ్, శ్రీరాములు, వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు అచ్చన నరసింహ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## దొరల గడీలను బద్దలుకొట్టిన ధీర వనిత చాకలి ఐలమ్మ



- 131వ జయంతి సందర్భంగా
  ఘన నివాళులు అర్పించిన
  ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన బిడ్డ, దొరల గడీలను బద్దలుకొట్టిన ధీర వనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు. శంషాబాద్ సిద్ధాంతి వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఆమెను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించిన చాకలి ఐలమ్మ నాటి నిజాం పాలనలో భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని అన్నారు. "నా భూమి.. నా పంట.. దొరలకు ఎందుకు కట్టాలి?" అంటూ తన పొలంలో పండిన ధాన్యాన్ని దొరల పాలు కాకుండా ప్రాణాలకు తెగించి కాపాడుకున్న వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ రగిలించిన పోరాట స్ఫూర్తి చుట్టుపక్కల గ్రామాలకు విస్తరించి, నిజాం వ్యతిరేక సాయుధ పోరాటానికి బలమైన పునాది వేసిందని తెలిపారు. పీడిత, అణగారిన వర్గాల ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. మహిళలు అబలలు కాదని, అన్యాయాన్ని ఎదిరించేందుకు తిరగబడితే రణచండిలా మారగలరని చాకలి ఐలమ్మ తన పోరాటంతో నిరూపించారని ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదుర్కోవడంలో ఆమె చూపిన తెగువ, ఆత్మస్థైర్యం, పోరాట పటిమ నేటి తరానికి ఎంతో ఆదర్శమని అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే చాకలి ఐలమ్మకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, చాకలి ఐలమ్మ కుల సంఘం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని ఆమె విగ్రహానికి నివాళులు అర్పించారు.

## ప్రజా సమస్యలపై గళమెత్తాలి.. జర్నలిస్టులు ఐక్యంగా నిలవాలి!

- దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
- అక్టోబర్ 7న సంగారెడ్డిలో రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి
- ఫోరం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సాబీర్ భాష



**కొత్తగూడెం, విశాలభారతి:** దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ ఆవిర్భావ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శుక్రవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు తాళ్ల వినోద్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సాబీర్ భాష పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్‌కే సాబీర్ భాష మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి జర్నలిస్టులు వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. దళిత జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఫోరం 11వ ఆవిర్భావ రాష్ట్ర మహాసభలను అక్టోబర్ 7న సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, జనరల్ సెక్రటరీ అరుణ్ తేజ, వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లపల్లి రిషి, జిల్లా అధ్యక్షుడు తాళ్ల వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్‌లో 51వ డివిజన్ సమస్యలపై గళమెత్తిన కార్పొరేటర్

**విశాలభారతి, రామగుండం :** మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో 51వ డివిజన్ కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్ తమ డివిజన్‌లోని సమస్యలను మేయర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. తాగునీటి అవసరాల కోసం డివిజన్‌లో బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు ఉచిత దహన సంస్కారాల సదుపాయం కల్పించాలని కోరారు. గోదావరి నది పక్కన ఉన్న శ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు, వీధి దీపాలు, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. లక్ష్మీనగర్ ఫుట్‌పాత్ పనుల నాణ్యత, ఖర్చులపై ప్రశ్నలు లేవనెత్తారు. సొంత ఇల్లు ఉందనే కారణంతో అర్హులైన వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పింఛన్లు నిరాకరించకుండా నిబంధనల ప్రకారం మంజూరు చేయాలని కోరారు. వీధి కుక్కలు, కోతుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిల్ ఎజెండాలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని, రాజకీయాలకు అతీతంగా డివిజన్ ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటానని ఆకారపు రేఖా మహేష్ తెలిపారు.

## సోయా పంటలో పొలం బడి కార్యక్రమము




**విశాలభారతి, బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని చిన్న దేవాడ గ్రామంలో జాతీయ నూనెగింజల మిషన్ పథకంలో భాగంగా బిచ్కుంద రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోయా చిక్కుడు పంటలో సమగ్ర పంట యాజమాన్యం పై పొలం బడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ రైతు బడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మాల్తుమ్మెద శాస్త్రవేత్త డా. రేవంత్ నాథన్ గారు మాట్లాడుతూ సోయా పంటలో విత్తనాలు వేసుకునే దశ నుంచి పంట కోత వరకు చేపట్టవలసిన వివిధ యాజమాన్య పద్ధతులు వివరించారు. సోయా పంటను ఆశించే ప్రధాన చీడపీడలు మరియు తెగుళ్ల లక్షణాలు, వాటిని నివారించడానికి తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు వివరించడం జరిగింది. అదే విధంగా సోయా పంటలో సమగ్ర కలుపు యాజమాన్యం, సమగ్ర నీటి యాజమాన్యం, సమగ్ర ఎరువుల యాజమాన్యం మరియు సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. సోయా పంటలో అధిక దిగుబడులు సాధించుకోవడానికి ఎంచుకోవాల్సిన రకాలు, కలుపు నివారణ, నీటి యాజమాన్యం, సస్యరక్షణ మరియు కోత సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంతోష్ గారు, మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, బిచ్కుంద రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ శంకర్ గారు, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ మరియు రైతులు పాల్గొన్నారు.



# వారితో ప్రయాణం ప్రమాదకరం

‘బంధాలకు పునాది నమ్మకమే. ఆ నమ్మకం ఒక్కసారి ఒమ్మయితే, పరిస్థితుల్ని మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం అసాధ్యం’ అంటున్నది అందాలభామ కాజల్ అగర్వాల్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతతలపై ఆసక్తికరంగా మాట్లాడింది కాజల్. ‘ప్రేమ, స్నేహం, కుటుంబం, వృత్తి.. ఇలా ఎక్కడైనా సరే.. నమ్మకద్రోహానికి ఒడిగట్టే వ్యక్తులకు జీవితంలో స్థానం ఇవ్వకూడదు. స్వార్థపూరిత ఆలోచనలతో నమ్మకాన్ని తుంగలో తొక్కే వారితో కలిసి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరం. పైకి నవ్వుతూ, లోపల స్వార్థాన్ని దాచుకునే వారిని గుర్తించి, వారికి దూరంగా ఉండటమే శ్రీరామరక్ష. అవసరాల కోసం స్నేహాన్నీ, సంబంధాలనూ వాడుకునే స్వార్థపరులు ప్రతి రంగంలోనూ ఉంటారు’ అని కాజల్ వ్యాఖ్యానించింది. ఈ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.